సాక్షి
ఆదిలాబాద్

గురువారం । 5 । డిసెంబర్ । 2024

కృష్ణం వందే జగద్గురుం



జిల్లా కేంద్రంలోని శ్రీరామచంద్ర గోపాలకృష్ణ మఠంలో ఈనెల 1న జాతర ప్రారంభం కాగా, నేడు రథోత్సవం నిర్వహించనున్నారు. 8లో▸

నేడు పత్తి కొనుగోళ్లు నిలిపివేత

ఆదిలాబాద్‌టౌన్: ఆదిలాబాద్ మార్కెట్ యార్డులో గురువారం పత్తి కొనుగోళ్లు నిలిపివేస్తున్నట్లు మార్కెట్ కార్యదర్శి మధుకర్ ప్రకటనలో తెలిపారు. బుధవారం రాత్రి కురిసిన అకాల వర్షం కారణంగా సీసీఐ, ప్రైవేట్ వ్యాపారులు పత్తి కొనుగోళ్లను చేపట్టడం లేదని పేర్కొన్నారు. విషయాన్ని రైతులు గమనించి సహకరించాలని కోరారు.

గరిష్టం/కనిష్టం
29.0/21.0

వాతావరణం

ఆకాశం మేఘావృతమై ఉంటుంది. పలుచోట్ల ఓ మోస్తరు వర్షం కురిసే అవకాశం ఉంది. గాలిలో తేమశాతం పెరగనుంది.

న్యూస్‌రీల్

ప్రశాంతంగా న్యాస్ పరీక్ష



పరీక్షను పరిశీలిస్తున్న గజేందర్

ఆదిలాబాద్‌టౌన్: విద్యార్థుల అభ్యసన సామర్థ్యాలను గుర్తించేందుకు కేంద్రప్రభుత్వం పరాక్ (న్యాస్) పరీక్షను బుధవారం నిర్వహించింది. జిల్లాలోని 95పాఠశాలల్లో 3,6,9 తరగతుల విద్యార్థులకు ఈ పరీక్ష నిర్వహించారు. 3వ తరగతికి సంబంధించి 32 పాఠశాలల్లో, 6వ తరగతికి సంబంధించి 28 పాఠశాలల్లో, 9వ తరగతికి సంబంధించి 35 పాఠశాలల్లో పరీక్ష నిర్వహించారు. 3వ తరగతిలో 695 మంది, 6వ తరగతిలో 684, 9వ తరగతిలో 917 మంది విద్యార్థులు హాజరయ్యారు. పరీక్ష నిర్వహణ కోసం 221 మంది డైట్ ఛాత్రోపాధ్యాయులను నియమించారు. ఈ పరీక్షను ఢిల్లీ పరిశీలకులు జె.కిషన్ ఇర్వాని, కేంద్రీయ విద్యాలయ ప్రిన్సిపాల్ విజయలక్ష్మి, డీఈవో ప్రణీత, డీసీఈబీ కార్యదర్శి, డీఎల్‌సీ–2 కందుల గజేందర్, సెక్టోరియల్ అధికారి శ్రీకాంత్, నారాయణ పరిశీలించారు. మూల్యాంకనం అనంతరం విద్యార్థుల అభ్యాసన సామర్థ్యాలు ఏ విధంగా ఉంటాయో తేలనుంది. 2017లో జిల్లా లోపర్మార్మెన్స్‌గా నమోదైన విషయం తెలిసిందే. ఈసారి ఫలితాలపై విద్యాశాఖలో ఉత్కంఠ నెలకొంది.

రేపు జిల్లాకు బీసీ డెడికేటెడ్ కమిషన్ రాక

కైలాస్‌నగర్: రాష్ట్రంలో త్వరలో నిర్వహించనున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు కల్పించాల్సిన రిజర్వేషన్లపై అభిప్రాయ సేకరణ కోసం నియమించిన తెలంగాణ వెనుకబడిన తరగతుల డెడికేటెడ్ కమిషన్ ఈ నెల 6న జిల్లాలో పర్యటించనున్నట్లు కలెక్టర్ రాజర్షి షా ప్రకటనలో తెలిపారు. కలెక్టరేట్ సమావేశ మందిరంలో ఉదయం 10.30 నుంచి మధ్యాహ్నం 2గంటల వరకు ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలోని బీసీ సంఘాల ప్రతినిధులు, కులస్తుల నుంచి కల్పించాల్సిన రిజర్వేషన్లపై అభ్యర్థనలు, సలహాలు, సూచనలు స్వీకరించనుందని పేర్కొన్నారు.

రేపు ఆదిలాబాద్‌కు రాష్ట్ర విద్యా కమిషన్ చైర్మన్ రాక

కైలాస్‌నగర్: తెలంగాణ రాష్ట్ర విద్యాకమిషన్ చైర్మన్ ఆకునూరి మురళి ఈనెల 6న జిల్లాకు రానున్నట్లు కలెక్టర్ రాజర్షిషా ప్రకటనలో తెలిపారు. కమిషన్ సభ్యులతో కలిసి జిల్లాలోని పలు ప్రభుత్వ విద్యాసంస్థలను సందర్శించనున్నట్లు పేర్కొన్నారు. ఈమేరకు సంబంధిత అధికారులు అన్ని ఏర్పాట్లు చేయాలని ఆదేశించారు.


నేడు జిల్లా స్థాయి క్రికెట్ ఎంపిక పోటీలు

ఆదిలాబాద్: స్థానిక ఇందిరా ప్రియదర్శిని స్టేడియంలో ఎస్జీఎఫ్ అండర్–19 జిల్లాస్థాయి బాలుర క్రికెట్ ఎంపిక పోటీలు గురువారం నిర్వహిస్తున్నట్లు ఆర్గనైజింగ్ సెక్రెటరీ కాంతారావు ప్రకటనలో తెలిపారు. క్రీడాకారులు వయస్సు ధ్రువీకరణ పత్రం బోనఫైడ్‌తో ఉదయం 9 గంటలకు పోటీల కన్వీనర్ రాష్ట్రపాల్‌కు రిపోర్ట్ చేయాలని సూచించారు. వివరాలకు 7702035200 నంబర్‌లో సంప్రదించాలని కోరారు.

అకాల వర్షం

ఆదిలాబాద్‌టౌన్: జిల్లాలోని పలు ప్రాంతాల్లో బుధవారం రాత్రి అకాల వర్షం కురిసింది. ఫెంగల్ తుపాన్ కారణంగా రెండు, మూడు రోజులుగా చలి తీవ్రత తగ్గింది. 8 డిగ్రీల సెల్సియస్‌కు పడిపోయిన కనిష్ట ఉష్ణోగ్రతలు తుపాన్ ప్రభావంతో మళ్లీ 20 డిగ్రీల మార్కు దాటాయి. ప్రస్తుతం వాతావరణంలో వచ్చిన మార్పుల కారణంగా చలి తీవ్రత తగ్గింది. పట్టణంలో రాత్రి దాదాపు అరగంటకు పైగా ఓ మోస్తరు వర్షం కురువగా.. పలు ప్రాంతాల్లో చిరుజల్లులు పడ్డాయి. ఈ వాన పత్తి పంటపై ప్రభావం చూపుతుందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

ఇచ్చోడ ఏఎంసీ నూతన పాలకవర్గం



కుమ్రం సత్యవతి

ఇచ్చోడ: ఇచ్చోడ వ్యవసాయ మార్కెట్ కమిటీ నూతన పాలకవర్గాన్ని నియమిస్తూ ప్రభుత్వం బుధవారం ఉత్తర్వులు జారీ చేసింది. చైర్‌పర్సన్‌గా కుమ్రం సత్యవతి, వైస్‌చైర్మన్‌గా చౌహాన్ శేషరావు, సభ్యులుగా బైరి లచ్చన్న, సిడాం జ్యోతిరాం, ఆత్రం గంగారాం, రాథోడ్ దూద్‌రాం, ఉయికె శ్యామ్‌రావు, కొడప మారుతి, తొడసం గోవింద్‌రావు, సిడాం గంగాప్రసాద్, పుర్క జంగుబాయిని నియమిస్తూ కోఆపరేటీవ్ మార్కెటింగ్ సెక్రెటరీ రఘునందన్‌రావు జారీ చేసిన ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

ప్రజల ఆశలకనుగుణంగా..

- నియోజకవర్గ అభివృద్ధే లక్ష్యంగా ..
- ప్రభుత్వానికి ప్రతిపాదనలు అందజేస్తున్నా
- కొన్ని అవుతున్నాయి.. మరి కొన్ని కావట్లేదు
- ప్రతిపక్షమైనా అభివృద్ధి విషయంలో అధికార పార్టీతో విభేదించడం లేదు
- రాజకీయాలకతీతంగా వారు కూడా కలిసిరావాలి
- ఏడాది పాలనపై 'సాక్షి' ఇంటర్వ్యూలో బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్



మాట్లాడుతున్న ఎమ్మెల్యే అనిల్ జాదవ్

'నాపై నమ్మకంతో గెలిపించిన ఈ ప్రాంతవాసులకు అండగా ఉంటూ ప్రజా సమస్యల పరిష్కారమే ధ్యేయంగా.. వారి ఆశలకు అనుగుణంగా.. నియోజకవర్గ అభివృద్ధే లక్ష్యంగా ముందుకు సాగుతున్నా.. ప్రతిపక్ష ఎమ్మెల్యే అయినప్పటికీ రాష్ట్ర ప్రభుత్వానికి అనేక ప్రతిపాదనలు చేస్తున్నా.. వాటిలో కొన్ని అవుతున్నాయి.. మరికొన్ని కావడం లేదు.. అలాగే బీఆర్‌ఎస్ పనైపోయిందనే వారికి నేను ఒకటే చెబుతున్నా.. మా పార్టీ క్షేత్రస్థాయిలో ఇప్పటికీ బలంగా ఉంది.. కార్యకర్తలు ఎటూ పోలేదు.. స్థానిక సంస్థల ఎన్నికల్లో మేము గెలుస్తున్నాం..' అని బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్ అన్నారు. ఏడాది పాలన పూర్తవుతున్న నేపథ్యంలో బుధవారం 'సాక్షి'కి ఇచ్చిన ఇంటర్వ్యూలో ఆయన పలు అంశాలపై ముచ్చటించారు.

– సాక్షి,ఆదిలాబాద్

సాక్షి: నియోజకవర్గ అభివృద్ధికి మీ ప్రణాళిక ఏమిటి?

ఎమ్మెల్యే: మొదటిసారి ఎమ్మెల్యేగా గెలిచినప్పటికీ అంతకు ముందు రాజకీయాల్లో ఎన్నో ఏళ్లుగా ఉన్నాను. ఈ నియోజకవర్గ ప్రజలతో ముందు నుంచి సంబంధాలు ఉన్నాయి. ఆ ఆదరణనే నాకు గడిచిన ఎన్నికల్లో కలిసి వచ్చింది. విజయం సాధించగానే ఈ ఐదేళ్లలో ఈ ప్రాంత అభివృద్ధి కోసం నేను ప్రత్యేక ప్రణాళిక రూపొందించుకున్నాను. ప్రధానంగా కుప్టి ప్రాజెక్ట్ పూర్తి చేసేందుకు శాయశక్తులా కృషి చేస్తా. కుంటాల, పొచ్చర, గాయత్రి, ఇతర జలపాతాలు ఉన్న దృష్ట్యా పర్యాటక అభివృద్ధి కోసం ప్రయత్నిస్తాను. ఈ నియోజకవర్గంలో అనేక మారుమూల గ్రామాలు ఉన్నాయి. వాటన్నింటికి రోడ్డు సౌకర్యం కల్పించే దిశగా ప్రయత్నం కొనసాగిస్తున్నాను. అలాగే అన్ని గూడేలు, తండాల్లో త్రీఫేజ్ విద్యుత్ సౌకర్యం కల్పించడమే లక్ష్యం. దిగువ పెన్‌గంగ కింద పిప్పల్‌కోటి రిజర్వాయర్ నిర్మాణ పనులు పూర్తి చేసే దిశగా ఈ ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకొస్తా. చెరువులు, పాఠశాల భవనాల నిర్మాణానికి సంబంధించి ప్రభుత్వానికి ప్రతిపాదనలు చేశాను. బోథ్ డివిజన్ సాధించేందుకు విస్తృతంగా ప్రయత్నం చేస్తున్నా. గ్రామాల్లో కూడా హైమాస్ట్ లైట్ల ఏర్పాటుకు కృషి చేస్తున్నా.

సాక్షి: నియోజకవర్గ అభివృద్ధిలో ప్రభుత్వ సహకారం ఎలా ఉంది..?

ఎమ్మెల్యే: ఇంతకుముందు ఎమ్మెల్యేలుగా ఉన్న వారు ఈ ప్రాంత అభివృద్ధిని పూర్తిస్థాయిలో చేపట్టలేదు. ఈ నియోజకవర్గంలో అనేక గిరిజన గ్రామాలు ఉన్నాయి. ఈ దృష్ట్యా కాంగ్రెస్ ప్రభుత్వం కూడా కలిసి రావాలి. నేను ప్రతిపక్ష ఎమ్మెల్యేగా ఉన్నప్పటికీ అభివృద్ధి విషయంలో అధికార పార్టీ నాయకులతో విభేదించడం లేదు. ఈ కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో ఇప్పటివరకు రూ.50 కోట్ల వరకు నిధులు తీసుకురావడం జరిగింది. రూ.10 కోట్ల సీఆర్‌ఆర్ ఫండ్స్ ద్వారా రోడ్ల నిర్మాణం, మరమ్మతులకు వెచ్చించాం. అందుకే నేను ఏమంటానంటే.. ఎన్నికలప్పుడే పార్టీలు.. ఆ తర్వాత ప్రజల ఆశలు, ఆకాంక్షలకు అనుగుణంగా నడుచుకోవాల్సిన బాధ్యత ప్రజాప్రతినిధులపై ఉంటుంది.

సాక్షి: గడిచిన ఏడాదిలో మీరు చేపట్టిన పనులేమిటి..?

ఎమ్మెల్యే: నేను ఎమ్మెల్యేగా గెలిచిన తర్వాత ఈ నియోజకవర్గానికి సుమారు రూ.100 కోట్లతో వివిధ అభివృద్ధి పనులు చేపట్టాను. అందులో రోడ్లు, చెక్‌డ్యాంలు, ఇతరత్రావి ఉన్నాయి. అటవీ అనుమతులు రాకపోవడంతో చాలా వరకు పనులు ముందుకు సాగడం లేదు. వాటి క్లియరెన్స్ కోసం ప్రయత్నాలు చేస్తున్నాను. 12 చెక్‌డ్యాంల నిర్మాణానికి రూ.3 కోట్ల నుంచి రూ.5 కోట్ల వరకు తీసుకువచ్చా. బజార్‌హత్నూర్ మండలం డెడ్రా అటవీ ప్రాంతాల్లో ఉంటుంది. ఈ మారుమూల గ్రామాన్ని ఇప్పటివరకు ఏ ఎమ్మెల్యే సందర్శించలేదు. నేను గెలిచిన తర్వాత మొదటిసారి అక్కడికి వెళ్లా. ఆ ప్రాంతానికి ఇప్పుడు తాత్కాలిక రోడ్డు వేశాం. త్వరలో బీటీ రోడ్డు కూడా వేస్తాం. ఈ విషయం ఎందుకు చెబుతున్నానంటే.. ఇలాంటి అనేక మారుమూల గ్రామాలు మా నియోజకవర్గంలో ఉన్నాయి. కుంటాల జలపాతం వద్ద పర్యాటక అభివృద్ధి కోసం రూ.3.5 కోట్లతో నిర్మించిన హరిత రిసార్ట్‌ను ఇటీవల ప్రారంభించడం జరిగింది. కరంజి వరకు నిర్మించే అంతర్రాష్ట్ర రహదారి అంచనా వ్యయాన్ని రూ.18 కోట్ల నుంచి రూ.31 కోట్లకు పెంచే విధంగా ప్రభుత్వాన్ని ఒప్పించాను.

సాక్షి: తొలిసారి ఎమ్మెల్యేగా గెలిచిన మీరు ప్రతిపక్షంలో ఉండటాన్ని ఎలా భావిస్తున్నారు..?

ఎమ్మెల్యే: తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత రెండుసార్లు మా బీఆర్‌ఎస్ ప్రభుత్వం అధికారంలో ఉంది. ఒకవేళ మరోసారి ప్రభుత్వం ఏర్పడి ఉంటే ఎక్కువ పనులు ఈ నియోజకవర్గంలో చేపట్టేవాడిని. ప్రజలు ఎన్నో ఆశలతో నన్ను గెలిపించారు. ప్రతిపక్ష ఎమ్మెల్యేగా నన్ను అవమానిస్తే నా ప్రజలను అవమానించినట్టే. రాజకీయాలకు అతీతంగా మానవతాదృక్పథంతో ఆలోచించి అభివృద్ధికి అందరు కలిసిరావాలి.

సాక్షి: స్థానిక సంస్థల ఎన్నికల్లో మీ పార్టీ పరిస్థితి ఎలా ఉండబోతుంది..?

ఎమ్మెల్యే: మాపార్టీ అధికారంలో ఉన్నప్పుడు ప్రజా సంక్షేమం కోసం అనేక పథకాలను అమలు చేశాం. రైతులకు రుణమాఫీ, రైతుబంధు, పేదల కోసం కల్యాణలక్ష్మి, షాదీముబారక్ వంటి పథకాలు ప్రజా ఆదరణ పొందాయి. మా ప్రభుత్వం రాష్ట్రంలో రూ.49వేల కోట్ల రుణమాఫీ చేస్తే ఈ ప్రభుత్వం కేవలం రూ.20వేల కోట్ల రుణమాఫీ చేసి గొప్పలకు పోతుంది. ఎన్నో పథకాలను అమలు చేసిన మా ప్రభుత్వాన్ని ప్రజలు మననం చేసుకుంటున్నారు. కాంగ్రెస్ కుట్ర పూరితంగా బీఆర్‌ఎస్ ఏమి చేయలేదని బద్నాం చేస్తుంది. స్థానిక ఎన్నికల్లో మేము గెలవడం ఖాయం. ప్రజలు మావైపే ఉన్నారు.

భోరజ్ చెక్‌పోస్టు వద్ద వాహనాల తనిఖీ (ఫైల్)



ఏసీబీ అధికారులు విడుదల చేసిన ప్రకటన ప్రతి



Press Note No. 156 Dt: 04.12.2024

ACB RAIDS ON RTA CHECK POSTS ACROSS THE TELANGANA

ఏసీబీ సోదాలు

- భోరజ్ చెక్‌పోస్టును తనిఖీ చేసిన అధికారులు
- లెక్కకురాని రూ.62,500 నగదు స్వాధీనం

ఆదిలాబాద్‌టౌన్: జైనథ్ మండలంలోని భోరజ్ అంతర్రాష్ట్ర చెక్‌పోస్టు వద్ద ఏసీబీ అధికారులు మంగళవారం అర్ధరాత్రి నుంచి బుధవారం తెల్లవారుజాము వరకు తనిఖీ నిర్వహించారు. ఏటా తనిఖీల్లో భాగంగా సోదాలు నిర్వహిస్తారు. రికార్డులు సరిగ్గా ఉన్నాయా.. ఎవరెవరు పనిచేస్తున్నారు.. తనిఖీలు ఎలా జరుగుతున్నాయి.. లెక్కలు సరిపోతున్నాయా వంటి విషయాలపై ఆరా తీస్తారు. అయితే ఏటా తనిఖీల్లో లెక్కకు మించి నగదు లభిస్తూనే ఉంటుంది. తాజాగా చేపట్టిన తనిఖీల్లోనూ లెక్కకు రాని రూ.62,500 నగదును ఏసీబీ అధికారులు స్వాధీనం చేసుకున్నారు. డ్యూటీలో ఉన్న అధికారుల, సిబ్బంది వివరాలు, ప్రైవేట్ వ్యక్తుల వివరాలతో పాటు అక్కడ జరుగుతున్న తంతును ఉన్నతాధికారులకు ఏసీబీ డీఎస్పీ రమణమూర్తి నివేదిక సమర్పించారు. రాష్ట్ర వ్యాప్తంగా ఏసీబీ అధికారులు ఏకకాలంగా ఆదిలాబాద్ జిల్లాలోని భోరజ్, నల్గొండలోని విష్ణుపురం చెక్‌పోస్టు, గద్వాల్‌లోని ఆలంపూర్ చెక్‌పోస్టులతో పాటు పలుచోట్ల ఈ సోదాలు జరిపారు. భోరజ్ చెక్‌పోస్టు జాతీయ రహదారి 44కు ఆనుకొని ఉంటుంది. ఈ మార్గం గుండా వెళ్లే భారీ వాహనాలకు సంబంధించి పర్మిట్, ఓవర్‌లోడ్, లైసెన్సులు, ట్యాక్స్‌లు, ఇతరత్రా పత్రాలు సరిగ్గా ఉన్నాయా.. లేదా అనేది చెక్ చేసి పంపించాల్సి ఉంటుంది. 24 గంటల పాటు అక్కడికి వచ్చిపోయే వాహనాల తనిఖీతో చెక్‌పోస్టు ప్రాంతం సందడిగా ఉంటుంది. ముఖ్యంగా ఇక్కడ రవాణా శాఖ అధికారులతో పాటు ప్రైవేట్ సిబ్బంది వాటికి సంబంధించిన ప్రక్రియ చేపట్టి లోటుపాట్లు గుర్తించి అక్రమంగా డబ్బులు గుంజడమే విధిగా సాగుతుంటుందనేది బహిర్గత రహస్యమే.

లెక్కకు మించిన డబ్బులెక్కడివి..

భోరజ్ అంతర్రాష్ట్ర చెక్‌పోస్టు వద్ద మహారాష్ట్ర వైపు నుంచి వచ్చే వాహనాలు, ఆదిలాబాద్ నుంచి మహారాష్ట్ర వైపు వెళ్లే వాహనాలను తనిఖీ చేస్తారు. నిబంధనలు ఉల్లంఘించిన వాహనదారులకు జరిమానా విధిస్తారు. అయితే వీటికి సంబంధించి లెక్క సరిగ్గానే ఉంటుంది. మిగతా డబ్బు ఎక్కడిదనేది ఏసీబీ అధికారులు ప్రశ్నించారు. రికార్డులను తనిఖీ చేయగా, వీటి లెక్క తేలలేదు. దీంతో అధికారులు విషయాన్ని ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లారు.

షరా మామూలే..

ఈ చెక్‌పోస్టు వద్ద డబ్బుల వసూలు కొన్నేళ్లుగా షరామామూలుగా అన్న చందంగా సాగుతోంది. ఉత్తర భారతదేశం వైపు నుంచి జిల్లా మీదుగా దాదాపు రోజుకు 3వేల నుంచి 4వేల వాహనాలు రాకపోకలు సాగిస్తుంటాయి. రవాణాశాఖ అధికారులు వాహనాలను తనిఖీ చేసినప్పుడు ఓవర్‌లోడ్ ఉందా.. సరుకులు వేసిన సమయంలో ప్రస్తుతం వాటికి సరితూగిందా లేదా, జీరో లోడ్ తీసుకెళ్తున్నారా.. పర్మిట్‌లో ఉన్న రోడ్డు మార్గం గుండానే వెళ్తున్నారా అనే విషయాలను పరిశీలిస్తారు. ఒకవేళ ఇందులో లోటుపాట్లు ఉంటే జరిమానాతో పాటు వేల రూపాయలను అక్రమంగా తీసుకుంటారనేది బహిరంగ రహస్యమే. వీటిని పక్కనబెడితే ఈ చెక్‌పోస్టు గుండా వెళ్లే ప్రతీ వాహనం పత్రాలపైన ముద్ర తప్పనిసరి వేయించుకోవాలి. ఇక్కడ పరిశీలన అనంతరం రాష్ట్ర సరిహద్దు వద్దనే పత్రాల తనిఖీలు చేస్తారు. మిగతా ప్రాంతాల్లో ఎక్కడ పరిశీలన జరపరు. దీన్ని ఆసరాగా చేసుకొని రవాణా శాఖాధికారులు కార్యాలయం ఎదుట ఓ డబ్బాను ఏర్పాటు చేశారు. ముద్ర వేసే ముందు ఆ డబ్బాలో రూ.200 నుంచి రూ.300 వరకు వేయడం ఆనవాయితీగా వస్తున్నట్లు సమాచారం. గత మేలో ఏసీబీ అధికారులు దాడి చేసిన సమయంలో వారి ముందే వాహనడ్రైవర్లు, క్లీనర్లు డబ్బాలో డబ్బులు వేయడం, ఉద్యోగులకు డబ్బులు ఇవ్వడానికి వచ్చే తంతును స్వయంగా గమనించారు. ఏటా తనిఖీ సమయంలో వేల రూపాయలు లెక్కకు మించి లభిస్తూనే ఉంటాయి. ప్రభుత్వం ఇలాంటి వారిపై ఎలాంటి చర్యలు చేపట్టకపోవడంతో మళ్లీ అక్రమ దందా యథావిధిగా సాగుతుందనే ప్రచారం ఉంది. ప్రతిరోజు లక్షల్లో డబ్బులు వసూలవుతుండగా, వాటిని ఎప్పటికప్పుడు తీసుకెళ్లేందుకు కొంత మంది ప్రైవేట్ వ్యక్తులను నియమించారనే ఆరోపణలు సైతం ఉన్నాయి. కింది స్థాయి ఉద్యోగి నుంచి ఉన్నత స్థాయి అధికారుల వరకు వాటాలు పంచుకుంటున్నారనే విమర్శలు సైతం వ్యక్తమవుతున్నాయి.

అటవీ సంరక్షణ అందరి బాధ్యత

- డీఎఫ్‌వో ప్రశాంత్ పాటిల్



మొక్క నాటి నీరు పోస్తున్న డీఎఫ్‌వో

ఆదిలాబాద్‌రూరల్: అటవీ సంరక్షణ అందరి బాధ్యతగా గుర్తించి సహకారం అందించాలని జిల్లా అటవీశాఖ అధికారి (డీఎఫ్‌వో) ప్రశాంత్ పాటిల్ అన్నారు. ప్రజాపాలన–ప్రజా విజయోత్సవాలు కార్యక్రమంలో భాగంగా మావలలోని హరితవనం పార్కులో బుధవారం నిర్వహించిన కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. అటవీశాఖ సిబ్బందితో కలిసి మొక్క నాటారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, జిల్లాలో పులి సంచరిస్తున్న చోట ప్రమాదాలు చోటు చేసుకోకుండా ముందస్తు చర్యలు తీసుకుంటున్నామన్నారు. ఇందులో భాగంగా మాస్కులు పంపిణీ చేశామన్నారు. కాగా, ప్రజాపాలన విజయోత్సవాల్లో భాగంగా అటవీశాఖ ఆధ్వర్యంలో ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు ఉపన్యాస, క్విజ్ పోటీలు నిర్వహించినట్లు తెలిపారు. ముందుగా పార్కు ఆవరణలో ఏర్పాటు చేసిన ఫొటో ఎగ్జిబిషన్‌ను తిలకించారు. ఆయన వెంట ఎఫ్‌ఆర్‌వో గులాబ్‌సింగ్, మల్కపూర్ పటేల్ జంగు పటేల్, రాజేశ్వర్, అటవీశాఖ సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

శక్తి అభియాన్ జాతీయ శిక్షణ తరగతులు ప్రారంభం



మణిశర్మను సన్మానిస్తున్న సుగుణ, శ్రీకాంత్‌రెడ్డి

ఆదిలాబాద్‌రూరల్: శక్తి అభియాన్, ఇందిరా ఫెలోషిప్ జాతీయ శిక్షణ తరగతులు ఆదిలాబాద్ జిల్లా మావల మండలకేంద్రంలోని తిరుమల క్లాసిక్ గార్డెన్‌లో బుధవారం ప్రారంభమయ్యాయి. ముఖ్యఅతిథిగా శక్తి అభియాన్ జాతీయ చైర్మన్ మణిశర్మ హాజరయ్యారు. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా కోఆర్డినేటర్ ఆత్రం సుగుణ ఆధ్వర్యంలో నిర్వహించిన శిక్షణ తరగతులకు వివిధ రాష్ట్రాలకు చెందిన శక్తి అభియాన్, ఇందిరా ఫెలోషిప్ కోఆర్డినేటర్లు పాల్గొన్నారు. తొలిరోజు మహిళల హక్కులపై పలువురు వక్తలు మాట్లాడారు. అలాగే జాతీయ చైర్మన్ మణిశర్మను సన్మానించారు. ఈ శిక్షణ తరగతులు మూడు రోజుల పాటు కొనసాగనున్నాయి. ఇందులో జాతీయ కోఆర్డినేటర్ డాక్టర్ సౌజన్య, రాష్ట్ర కోఆర్డినేటర్ శివలాల్, కిసాన్ కాంగ్రెస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బోరంచు శ్రీకాంత్ రెడ్డి, న్యాయవాది పెందూరు గోపి, మహేందర్, చంద్రశేఖర్, నవీన్, ఆనంద్‌రావ్, శ్రీధర్, పాల్గొన్నారు.

నాణ్యమైన భోజనం అందించాలి

ఇచ్చోడ: ఆశ్రమ, గురుకుల పాఠశాలలు, ప్రభుత్వ వసతి గృహాల్లో విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలని డీఎంహెచ్‌వో నరేందర్ రాథోడ్ అన్నారు. మండల కేంద్రంలోని వైటీసీలో బోథ్ డివిజన్‌లోని ఆశ్రమ, గురుకుల పాఠశాలలు, వసతి గృహాల వార్డెన్లు, కుక్‌లు, ఏఎన్‌ఎంలతో నిర్వహించిన ఒకరోజు శిక్షణ కార్యక్రమంలో పాల్గొని మాట్లాడారు. వంట తయారీ సందర్భంగా కిచెన్‌లో పరిశుభ్రత పాటించాలన్నారు. అలాగే వార్డెన్లు ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలన్నారు. విద్యార్థులకు భోజనం వేడిగా ఉన్నప్పుడే అందించాలన్నారు. ఆయన వెంట జిల్లా ఫుడ్‌సేఫ్టీ అధికారి శ్రీధర్, ఏటీడీవో అమిత్, జీసీడీవో మెస్రం చాయ, ఎస్‌వో బ్రహ్మానందరెడ్డి పాల్గొన్నారు.

సీఎం కప్'కు సన్నద్ధం

- షెడ్యూల్ విడుదల చేసిన ప్రభుత్వం
- 7నుంచి పోటీలు ప్రారంభం



సీఎం కప్ పోటీల లోగో

ఆదిలాబాద్: మారుమూల ప్రాంతాల్లో ఉన్న క్రీడాకారుల ప్రతిభను వెలికి తీయాలనే ఉద్దేశంతో రాష్ట్ర ప్రభుత్వం సీఎం కప్ –2024 పోటీలకు సన్నద్ధమవుతోంది. గ్రామ స్థాయి నుంచి రాష్ట్ర స్థాయి వరకు పోటీల నిర్వహణకు అధికా రులు సిద్ధమవుతున్నారు. ఇప్పటికే ఆయా శాఖల అధి కారులతో కలెక్టర్ సమావేశమై నిర్వహణకు సంబంధించి తీసుకోవాల్సిన చర్యలపై దిశా నిర్దేశం చేశారు. పకడ్బందీగా నిర్వహించాలని ఆదేశించారు. కాగా, ప్రజాపాలన విజయోత్సవాల్లో భాగంగా ఈ నెల 1న సీఎం కప్ టూకే ర్యాలీ సైతం నిర్వహించారు. ఈ నెల 7నుంచి పోటీలు ప్రారంభం కానున్నాయి.

షెడ్యూల్ ఖరారు..

సీఎం కప్ పోటీలను నాలుగు దశల్లో నిర్వహించనున్నారు. గ్రామ, మండల, జిల్లా, రాష్ట్రస్థాయుల్లో విడతల వారీగా కొనసాగనున్నాయి. ఈనెల 7, 8 తేదీల్లో గ్రామస్థాయి, 10నుంచి 12 వరకు మండల స్థాయి, 16 నుంచి 21వరకు జిల్లా స్థా యి పోటీలు నిర్వహించనున్నారు. జిల్లా స్థాయిలో ప్రతిభ కనబరిచిన వారిని రాష్ట్రస్థాయికి ఎంపిక చేస్తారు. ఈనెల 27నుంచి వచ్చేఏడాది జనవరి 2 వరకు రాష్ట్రస్థాయి పోటీలు ఉండేలా రాష్ట్ర క్రీడా ప్రాధికార సంస్థ (సాట్స్) షెడ్యూల్ ఖరారు చేసింది.

ఈ క్రీడాంశాల్లో ..

గ్రామపంచాయతీ, మున్సిపల్, మండలస్థాయిల్లో అథ్లెటిక్స్, కబడ్డీ, ఖోఖో, వాలీబాల్, ఫుట్‌బా ల్ అంశాల్లో పోటీలు నిర్వహించనున్నారు. జిల్లాస్థాయి విషయానికి వస్తే మండల స్థాయి వరకు నిర్వహించే పోటీలతో పాటు బ్యాడ్మింటన్, బా క్సింగ్, స్విమ్మింగ్, రెజ్లింగ్, హ్యాండ్‌ బాల్, బాస్కె ట్ బాల్, చెస్, నెట్ బాల్, జూడో, లాన్ టెన్నిస్, ఆర్చరీ, కిక్ బాక్సింగ్, వుషూ, యోగా, బేస్ బా ల్, పారా స్పోర్ట్స్ అంశాలు అదనంగా ఉంటా యి. రాష్ట్ర స్థాయి విషయానికి వస్తే జిల్లాస్థాయిలో నిర్వహించే పోటీలతో పాటు తైక్వాండో, బిలియర్డ్స్ అండ్ స్నూకర్, కనోయింగ్ అండ్ ఆయా కింగ్, పవర్ లిఫ్టింగ్, ఆత్యాపాత్య, సైక్లింగ్, కిక్ బా క్సింగ్, కరాటే, సెపక్ తక్రా, టేబుల్ టెన్నిస్, వెయిట్ లిఫ్టింగ్, జిమ్నాస్టిక్స్, షూటింగ్, హాకీ క్రీడాంశాలు అదనంగా ఉంటాయి.

విభాగాలు.. అర్హులు

సబ్ జూనియర్, జూనియర్, సీనియర్ విభాగా ల్లో క్రీడాకారులు పోటీ పడవచ్చు. అండర్–14 నుంచిఅండర్–23 వరకుబాలబాలికలు, పురుషులు, మహిళలు పోటీపడే అవకాశం ఉంటుంది.

రిజిస్ట్రేషన్ చేసుకోవచ్చిలా...

పోటీల్లో పాల్గొనదలిచే క్రీడాకారులు టీజీసీఎం కప్–2024 మొబైల్ యాప్ ద్వారా కానీ, https://cmcup2024.telangana.gov.in వెబ్‌సైట్ ద్వారా ఆన్ లైన్ రిజిస్ట్రేషన్ చేసుకోవాల్సి ఉంటుంది.

పెద్దపల్లికి తరలిన గ్రూప్–4 అభ్యర్థులు



జెండా ఊపి బస్సును ప్రారంభిస్తున్న అదనపు కలెక్టర్ శ్యామలాదేవి

కైలాస్‌నగర్: టీజీపీఎస్సీ ఆధ్వర్యంలో నిర్వహించిన గ్రూప్–4 రాత పరీక్షలో ప్రతిభ చాటి వివిధ శాఖల్లో ప్రభుత్వ ఉద్యోగాలకు ఎంపికైన అభ్యర్థులు బుధవారం పెద్దపల్లికి తరలివెళ్లారు. అక్కడి జిల్లా కేంద్రంలో యువ వికాసంలో భాగంగా నిర్వహించిన కార్యక్రమంలో సీఎం రేవంత్‌రెడ్డి చేతుల మీదుగా పోస్టింగ్ ఆర్డర్లు అందుకునేందు కోసం నాలుగు ప్రత్యేక బస్సుల్లో తరలివెళ్లారు. కలెక్టరేట్ నుంచి బయలుదేరిన ఈ బస్సులను అదనపు కలెక్టర్ శ్యామలా దేవి జెండా ఊపి ప్రారంభించారు. ఆదిలాబాద్ జిల్లాకు 176 మంది గ్రూప్– 4 అభ్యర్థులను టీజీపీఎస్సీ కేటాయించింది. ఇందులో 48 మంది మున్సిపల్ వార్డు అధికారులుగా, అలాగే 14మంది జీసీసీ, 14 మంది వాణిజ్యపన్నులు, 12 మంది బీసీ గురుకులాలు, 19 మంది రెవెన్యూ శాఖలో కలిపి 107 మంది ఉండగా మరో 69 మంది వివిధ శాఖల ఉద్యోగులు ఉన్నారు. వీరిలో పలువురు సీఎం చేతుల మీదుగా పోస్టింగ్ ఆర్డర్ అందుకున్నారు. త్వరలోనే ఆయా శాఖల్లో విధుల్లో చేరనున్నారు. వారి వెంట పలువురు పోలీసులతో పాటు ఉద్యోగులు వెళ్లారు. ఇందులో కలెక్టరేట్ ఏవో బి.రాంరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

గ్రంథాలయాలు విజ్ఞాన భాండాగారాలు

ఆదిలాబాద్‌టౌన్(జైనథ్): గ్రంథాలయాలు విజ్ఞాన భాండాగారాలని ఆదిలాబాద్ డీఎస్పీ ఎల్.జీవన్‌రెడ్డి అన్నారు. జైనథ్ మండలంలోని మేడిగూడలో మన పల్లె స్వచ్ఛంద సేవ సంస్థ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన గ్రంథాలయాన్ని బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, యువత చెడు వ్యసనాలకు లోనుకాకుండా పుస్తక పఠనం అలవర్చుకోవాలన్నారు. గ్రామాల్లో సైతం స్వచ్ఛంద సంస్థలు గ్రంథాలయ ఏర్పాటుకు ముందుకు రావడం అభినందనీయమని కొనియాడారు. కార్యక్రమంలో సేవ సాయినాథ్, ఎస్సై పురుషోత్తం, శ్యామ్‌సుందర్, ప్రధానోపాధ్యాయుడు సత్యవాన్ చిట్కే, శివప్రసాద్ రెడ్డి, గ్రామస్తులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

జ్వరంతో యువతి మృతి


శ్రీదేవి (ఫైల్)

ఇంద్రవెల్లి: జ్వరంతో యువతి మృతి చెందింది. ఈ ఘటన బుధవారం మండలంలోని పిట్టబొంగరం గ్రామపంచాయతీ పరిధి ఓల్‌మద్రి గ్రామంలో చోటు చేసుకుంది. మృతురాలి కుటుంబీకులు, గ్రామస్తులు తెలిపిన వివరాల ప్రకారం.. ఓల్‌మద్రి గ్రామానికి చెందిన వెట్టి జాకు, భారతీబాయి దంపతుల కూతురు శ్రీదేవి (19) మూడునెలలుగా తిర్యాణి మండలంలోని బంధువుల వద్ద ఉంటోంది. 15 రోజులుగా జ్వరంతో బాధ పడుతుండగా బంధువులు పలు ఆస్పత్రుల్లో చికిత్స చేయించినా ఆరోగ్యం కుదుటపడలేదు. రెండు రోజుల క్రితం ఓల్‌మద్రి గ్రామానికి తీసుకువచ్చి మండలకేంద్రంలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స చేయించినా ఫలితం లేకపోయింది. పరిస్థితి విషమించి బుధవారం తెల్లవారుజామున శ్రీదేవి ఇంట్లోనే మృతి చెందింది.

గుర్తు తెలియని వాహనం ఢీకొని ఒకరి మృతి

ఆదిలాబాద్‌టౌన్(జైనథ్): జైనథ్ మండలం పిప్పర్‌వాడకు చెందిన మేకల అశోక్ (51) మంగళవారం రాత్రి గుర్తు తెలియని వాహనం ఢీకొని మృతిచెందినట్లు జైనథ్ ఎస్సై పురుషోత్తం తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం.. అశోక్ కూలీ పనిచేస్తూ జీవనం సాగిస్తున్నాడు. రోజులాగే పూసాయి గ్రామానికి కూలీ పనికోసం వెళ్లి రాత్రి 8.30 గంటల ప్రాంతంలో తిరిగి వస్తుండగా గుర్తు తెలియని వాహనం ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో అశోక్ తలతో పాటు పలు శరీర భాగాలకు తీవ్రగాయాలైనట్లు పేర్కొన్నారు. దీంతో ఘటనాస్థలిలోనే మృతిచెందినట్లు వివరించారు. మృతుడి కుమారుడు ఆకాశ్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

గని కార్మికుడికి గాయాలు

కాసిపేట: మందమర్రి ఏరియాలోని కాసిపేట–1 ఇంక్‌లైన్ గనిలో బుధవారం ఉదయం జనరల్ మజ్దూర్ జరుపుల శ్రీనివాస్ చేతి వేలికి తీవ్ర గాయాలు కాగా రామకృష్ణాపూర్ ఏరియా ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు. తోటి కార్మికులు తెలిపిన వివరాల ప్రకారం.. ఇంజినీరింగ్ డిపార్ట్‌మెంట్‌లో విధులు నిర్వహించే శ్రీనివాస్ ఫ్రీ షిఫ్టులో ఉదయం 4గంటలకు విధులకు హాజరయ్యాడు. ప్యానల్ త్రీ ఎస్ లెవెల్ 11డిస్ట్రిక్‌లో వెల్డింగ్ హెల్పర్‌గా విధులు నిర్వహిస్తున్నాడు. 8గంటలకు గ్యాస్ సిలిండర్ లాగే క్రమంలో ఎడమ చేతి బొటనవేలు రెండు సిలిండర్ల మధ్య ఇరుక్కుని తీవ్రగాయమైంది. వెంటనే అతడిని ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతున్నాడు. శ్రీనివాస్‌ను ఏఐటీయూసీ నాయకులు మిసుగు లక్ష్మీనారాయణ, పార్వతి సురేశ్, మైన్ కమిటీ నాయకులు పరామర్శించారు. అధికారులు ఫ్రీ షిఫ్టుల పేరుతో కార్మికులను ఒత్తిడి గురిచేయడంతోనే ఇలాంటి ఘటనలు జరుగుతున్నాయని కార్మికులు ఆరోపిస్తున్నారు. తెల్లవారుజామున 4గంటలకు లేచేందుకు రాత్రి నిద్రపోకుండా గడపాల్సి వస్తోందని తెలిపారు. పని స్థలంలోనూ వచ్చే షిఫ్టు వారికోసం ఏర్పాట్లు చేస్తూ ఇబ్బందులకు గురి కావాల్సి వస్తోందని వాపోతున్నారు. రక్షణపై ప్రతీరోజు చెప్పే అధికారులకు ఫ్రీ షిఫ్టుల ఒత్తిడి కనిపించడం లేదనే విమర్శలున్నాయి. గతంలోనూ ఫ్రీ షిఫ్టులో కార్మికుడు గుండెపోటుతో మృతిచెందాడు.

గోదావరికి పంచహారతి


గంగాహారతి ఇస్తున్న అర్చకులు

బాసర: బాసర శ్రీజ్ఞాన సరస్వతీ ఆలయ వైదిక బృందం ఆలయ కార్యనిర్వహణాధికారి విజయరామారావు ఆదేశాల మేరకు బుధవారం గోదావరినది ఘాట్–1 వద్ద పంచహారతి కార్యక్రమాన్ని అంగరంగ వైభవంగా నిర్వహించారు. భక్తులు అధికసంఖ్యలో హాజరయ్యారు.

కృష్ణం వందే జగద్గురుం

- గోపాలకృష్ణ మఠం జాతర షురూ..
- శతాబ్దాలుగా నిర్వహిస్తున్న ఉత్సవం
- మఠానికి నాలుగు శతాబ్దాల చరిత్ర
- నేడు కనుల పండువగా రథోత్సవం


పూజలందుకుంటున్న సత్యభామ రుక్మిణీ సమేత గోపాలకృష్ణస్వామి (ఫైల్)


శ్రీరామచంద్ర గోపాలకృష్ణ మఠం

ఆదిలాబాద్: 400 ఏళ్ల చరిత్ర.. ఆలయంలోనే మఠాధిపతుల సమాధులు.. ద్వారకలో రూపుదిద్దుకున్న స్వామివారి విగ్రహం.. నాలుగు శతాబ్దాల వయస్సుగల మర్రి వృక్షం.. ఇలా చెప్పుకొంటూ పోతే ఆ ఆలయానికి ఎన్నో ప్రత్యేకతలు. ఆ దేవాలయమే ఆదిలాబాద్ జిల్లా కేంద్రంలోని శ్రీరామచంద్ర గోపాలకృష్ణ మఠం. ఈ కోవెలకు ఎంతో విశిష్టత ఉంది. నిత్య పూజలు అందుకునే సత్యభామ రుక్మిణీ సమేత గోపాలకృష్ణ ఆలయంలో ఏటా మార్గశిర మాసంలో జాతర మహోత్సవాలు వైభవంగా నిర్వహిస్తారు. ఈనెల 1న జాతర ప్రారంభం కాగా, నేడు రథోత్సవాన్ని నిర్వహించేందుకు ఆలయ నిర్వాహకులు ఏర్పాట్లు చేస్తున్నారు.

మఠం చరిత్రను పరిశీలిస్తే..

వ్యవస్థాపకులైన శ్రీపూర్ణానంద సరస్వతి స్వామీజీ 400 ఏళ్ల క్రితం ఉత్తర భారతం నుంచి సంచరిస్తూ ప్రస్తుతం మఠం ఉన్న ప్రాంతంలో ప్రకృతి సౌందర్యానికి ముగ్ధులై ఇక్కడే ఉన్న మర్రి వృక్షాన్ని ధ్యాన స్థావరంగా చేసుకున్నారు. మఠాన్ని ఏర్పాటు చేసుకుని ఇక్కడే తపస్సును ఆచరించారు. స్వామీజీ తపస్సు ఆచరించిన వట వృక్షం ఇప్పటికీ ఉండడం విశేషం. స్వామీజీ తన చివరి రోజుల్లో మఠానికి తొలి ఉత్తరాధికారిగా శ్రీ సచ్చిదానంద సరస్వతి స్వామిని నియమించారు. ఇప్పటివరకు ఎనిమిది మంది ఉత్తరాధికారులుగా వ్యవహరించగా, ప్రస్తుతం శ్రీ యోగానంద సరస్వతి స్వామి పదో మఠాధిపతిగా కొనసాగుతున్నారు. మఠ వ్యవస్థాపకులు పూర్ణానంద సరస్వతి స్వామితో పాటు ఎనిమిది మంది ఉత్తరాధికారుల సమాధులు కూడా ఆలయ ప్రాంగణంలోనే ఉండటం ప్రత్యేకతను చాటుతోంది.

వైవిధ్యం విగ్రహ ప్రతిష్ఠాపనం

మఠంలో కొలువుదీరిన స్వామివారి మూర్తిని శాలిగ్రామంతో రూపొందించారు. శతాబ్దాల క్రితం ఎలాంటి వాహనాలు ఉపయోగించకుండా ద్వారక నుంచి స్వామి వారి విగ్రహాన్ని తీసుకువచ్చినట్లు చరిత్ర చెబుతోంది. భక్తులు ఒక గ్రామం నుంచి మరో గ్రామానికి.. అడవులు, కొండలు, కోనలు, నదులు, వాగులు దాటుతూ శ్రేణిలా ఏర్పడి చేతుల మీదుగా విగ్రహాన్ని ఇక్కడి వరకు చేర్చినట్లు తెలుస్తోంది. ఆలయంలో దుర్గాదేవి, సీతారాములు, విఠల రుక్మాబాయి విగ్రహాలు దర్శనమిస్తాయి.

జాతర నిర్వహిస్తారిలా..

మఠ వ్యవస్థాపకులు శ్రీ పూర్ణానంద సరస్వతి స్వామి పుణ్యతిథిని పురస్కరించుకుని జాతర మహోత్సవాలు ఆరంభమవుతాయి. మార్గశిర మాసంలో అమావాస్య నుంచి ఐదురోజులపాటు వివిధ పూజా కార్యక్రమాలు నిర్వహిస్తారు. తొలిరోజైన అమావాస్య రోజున మఠాధిపతిగా వ్యవహరించే స్వామీజీ భిక్ష గ్రహణం చేస్తారు. రెండోరోజు ఉదయం అభిషేకంతో పాటు రాత్రి సమయంలో అశ్వవాహన సేవ ఉంటుంది. మూడోరోజు పూర్ణానంద సరస్వతి స్వామీజీ పుణ్య తిథి నిర్వహిస్తారు. అలాగే గజ వాహన సేవ ఉంటుంది. నాలుగోరోజు హనుమత్, గరుడ వాహన ఉత్సవాలుంటాయి. ఐదోరోజు బలిహరణం, రథ పూజ చేసి సత్యభామ రుక్మిణీ సమేత గోపాలకృష్ణమూర్తి, పూర్ణానంద సరస్వతి స్వామి మూర్తులతో రథోత్సవాన్ని అంగరంగ వైభవంగా నిర్వహిస్తారు. ఈ ఉత్సవాన్ని వీక్షించడానికి భక్తులు అధికసంఖ్యలో తరలివస్తారు. అనంతరం జాతర పది రోజుల పాటు కొనసాగుతుంది.

కేజీబీవీలకు కార్పెట్లు, దుప్పట్లు


కేజీబీవీ తరగతి గదిలో చదువుకుంటున్న విద్యార్థినులు (ఫైల్)

- ఈ నెల 15లోపు సరఫరా
- విద్యాశాఖ అధికారులకు ఆదేశాలు

ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా...

జిల్లా	కేజీబీవీలు	విద్యార్థులు
ఆదిలాబాద్	18	4,422
కుమురంభీం	15	3,991
మంచిర్యాల	18	4,607
నిర్మల్	18	5,562

మంచిర్యాలఅర్బన్: కస్తూర్బాగాంధీ బాలిక విద్యాలయా (కేజీబీవీ)ల్లో విద్యార్థినులకు కార్పెట్లు, దుప్పట్లు, ఉలెన్ బ్లాంకెట్ల పంపిణీకి ప్రభుత్వం నిర్ణయించింది. తెలంగాణ హ్యాండ్లూమ్ వీవర్స్ సొసైటీ నుంచి 2024–25 విద్యాసంవత్సరానికి సంబంధించి ఈ నెల 15లోపు ఆయా కేజీబీవీలకు నేరుగా సరఫరా చేయనుంది. విద్యాలయాలకు చేరగానే సకాలంలో విద్యార్థులకు అందించాలని విద్యాశాఖ అధికారులకు ఆదేశాలు వచ్చాయి. కాగా, గత నెల 27న 'చలిలోనూ చన్నీటి స్నానమే' శీర్షికన చలి తీవ్రతతో విద్యార్థులు పడుతున్న ఇబ్బందులపై 'సాక్షి'లో కథనం ప్రచురితమైంది. ఈ నేపథ్యంలో ప్రభుత్వం ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా 18,582 మంది విద్యార్థులకు కార్పెట్లు, దుప్పట్లు, బ్లాంకెట్లు మంజూరు చేసింది. చలి తీవ్రత క్రమంగా పెరుగుతున్న నేపథ్యంలో రెండేళ్ల తర్వాత విద్యార్థినులకు చలికి కప్పుకొనే రగ్గులు, నేలపై పరుచుకునే కార్పెట్లు, దుప్పట్లు రావడంతో ఊరటనిస్తోంది.

విద్యార్థులు ఎక్కువ.. సరఫరా తక్కువ

మంచిర్యాల జిల్లాలో 18 కేజీబీవీల్లో విద్యార్థులు చదువుతున్నారు. ఇదివరకు పంపిణీ చేసిన దుప్పట్లు, కార్పెట్లు, ఉలెన్ బ్లాకెంట్ల పంపిణీ గందరగోళంగా ఉండేది. కొత్తగా ప్రవేశాలు పొందిన ఇంటర్, ఆరో తరగతి విద్యార్థినులకు మాత్రమే సరఫరా చేసిన సందర్భాలున్నాయి. కొన్నింటిలో అసలే పంపిణీ కాని పరిస్థితి. విద్యార్థినులు ఎక్కువ ఉన్న చోట తక్కువ పంపిణీ చేయడంతో అయోమయం నెలకొంది. దుప్పట్లు, బ్లాంకెట్లు సరఫరా కాకపోవడంతో ఇంటి నుంచి తెచ్చుకోవాల్సి వస్తోంది.

యువజన కాంగ్రెస్ అధ్యక్షుడిగా పోతారెడ్డి


పోతారెడ్డి

నేరడిగొండ: యువజన కాంగ్రెస్ బోథ్ నియోజకవర్గ అధ్యక్ష పదవికి ఆన్‌లైన్ ఓటింగ్ నిర్వహించగా బుధవారం ఫలితాలు విడుదలయ్యాయి. తేజాపూర్ గ్రామానికి చెందిన బద్దం పోతారెడ్డి విజయం సాధించారు. రెండోసారి అధ్యక్షుడిగా ఎన్నిక కావడంపై ఆయన సంతోషం వ్యక్తంజేశారు. తన విజయానికి కృషి చేసిన నాయకులు, కార్యకర్తలకు కృతజ్ఞతలు తెలిపారు.

జిన్నింగ్ మిల్లు కన్వేయర్ బెల్ట్‌పై పడి ఒకరు మృతి


పరశురాం (ఫైల్)

ఇంద్రవెల్లి: జిన్నింగ్ మిల్లు కన్వేయర్ బెల్టుపై పడి ఒకరు మృతి చెందిన ఘటన బుధవారం సాయంత్రం మండలంలోని ఏమాయికుంట గ్రామంలో చోటు చేసుకుంది. ప్రత్యక్ష సాక్షులు, ఎస్సై సునీల్ తెలిపిన వివరాల ప్రకారం.. ఏమాయికుంట పంచాయతీ పరిధి గలియబాయితండా సమీపంలోగల విజయలక్ష్మి జిన్నింగ్ మిల్లు పర్యవేక్షణ బాధ్యతను యజమాని తగ్రే జ్ఞాన్‌సింగ్ తండ్రి పరశురాం (55) చూస్తుంటాడు. రోజులాగే బుధవారం అతడు కూలీలతో పనులు చేయిస్తూ కన్వేయర్ బెల్ట్ వద్ద నిలిచిన పత్తిని తొలగిస్తున్నాడు. ఈక్రమంలో ప్రమాదవశాత్తు బెల్ట్‌లో చేయి చిక్కుకుంది. తీవ్రంగా గాయపడిన అతడు స్పృహ కోల్పోయాడు. వెంటనే స్థానికులు అతడిని వాహనంలో ఆదిలాబాద్ రిమ్స్‌కు తరలిస్తుండగా మార్గంమధ్యలో మృతి చెందాడు. ఎస్సై ఘటనా స్థలాన్ని పరిశీలించి కుటుంబీకుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశారు. పంచనామా నిర్వహించి మృతదేహాన్ని పోస్టుమార్టం కోసం రిమ్స్‌కు తరలించారు. మృత్యుడికి భార్య పులబాయి, మిల్లు యజమాని జ్ఞాన్‌సింగ్, కుటుంబీకులు నానక్, జగన్ ఉన్నారు.

సిలిండర్ పేలి పెంకుటిల్లు దగ్ధం


ప్రమాదంలో కాలిపోయిన ఇంటి సామగ్రి

ఇంద్రవెల్లి: ప్రమాదవశాత్తు గ్యాస్ సిలిండర్ పేలి పెంకుటిల్లు దగ్ధమైంది. ఈ ఘటన బుధవారం మండలకేంద్రంలో జరిగింది. బాధిత కుటుంబీకులు, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. మండలకేంద్రంలోని చిచ్‌ధరిఖానాపూర్ రోడ్ జామా మసీదు పక్కన నివాసముంటున్న షేక్ సలీం ఇంట్లో వంట గ్యాస్ సిలిండర్ పైప్ లీకై మంటలు చెలరేగాయి. స్థానికులు మంటలను ఆర్పే ప్రయత్నం చేశారు. అప్పటికే ఇంట్లోని బియ్యం, నిత్యావసరాలు, బట్టలు, ఇతర సామగ్రి పూర్తిగా కాలిపోయాయి. సుమారు రూ.90వేల ఆస్తి నష్టం జరిగింది. ప్రభుత్వం ఆదుకోవాలని బాధితుడు కోరుతున్నాడు.

ఎల్లమ్మ ఆలయంలో చోరీ

భైంసారూరల్: మండలంలోని వానల్‌పాడ్ గ్రామంలోని ఎల్లమ్మ ఆలయంలో చోరీ జరిగింది. సీఐ నైలు తెలిపిన వివరాల ప్రకారం.. భైంసా–నిర్మల్ జాతీయ రహదారికి ఆనుకుని ఉన్న ఎల్లమ్మ గుట్టపై ఇటీవలే చింతచెట్టుకు స్వయంభూగా దుర్గామాత వెలిసింది. రెండు నెలలుగా భక్తుల సంఖ్య పెరిగింది. భక్తుల కానుకలు స్వీకరించేలా ఆలయ కమిటీ నిర్వాహకులు అక్కడ హుండీలను ఏర్పాటుచేశారు. ఎప్పటిలాగే బుధవారం వేకువజామున భక్తులు ఆలయానికి వెళ్లగా హుండీలు కనిపించలేదు. విషయాన్ని ఆలయ కమిటీకి తెలపడంతో వారు చోరీ జరిగినట్లు గుర్తించారు. భక్తులు సమర్పించిన కానుకలను దొంగలు ఎత్తుకువెళ్లారు. అమ్మవారికి వెండితో తయారు చేయించిన తులన్నర వెండి ముక్కుపుడక, ఇతర కానుకలు అపహరించారు. ఘటనా స్థలానికి వెళ్లిన పోలీసులు అక్కడి సీసీ కెమెరాల్లో రికార్డయిన పుటేజీలను పరిశీలించారు. రెండుబృందాలుగా ఏర్పడి త్వరలోనే దొంగలను పట్టుకుంటామని సీఐ నైలు తెలిపారు. ఆలయ పరిసరాల్లోని దృశ్యాలు, సీసీ పుటేజీలను పరిశీలించి వివరాలు సేకరిస్తున్నారు. ఆలయ కమిటీ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

బంగారం దుకాణంలో చోరీ


దుకాణాన్ని పరిశీలిస్తున్న పోలీసులు

నిర్మల్‌టౌన్: జిల్లా కేంద్రంలోని దివ్యనగర్ కాలనీలోగల లక్ష్మీప్రసన్న బంగారం దుకాణంలో మంగళవారం అర్ధరాత్రి చోరీ జరిగింది. దుకాణం మూసేసి ఇంటికి వెళ్లిన యజమాని విశ్వనాథ్ బుధవారం ఉదయం దుకాణం తెరిచేందుకు షాప్ వద్దకు రాగా.. షెటర్ తాళాలు పగులగొట్టి ఉన్నాయి. దొంగతనం జరిగినట్లు గుర్తించి అతడు వెంటనే పోలీసులకు సమాచారం ఇచ్చాడు. ఘటనాస్థలికి చేరుకున్న సీఐ ప్రవీణ్‌కుమార్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. నాలుగు కిలోల వెండి, రెండు తులాల బంగారం చోరీకి గురైనట్లు బాధితుడు పేర్కొన్నాడు. దుకాణంలోని సీసీ కెమెరాల్లోని హార్డ్ డిస్క్‌ను కూడా దుండగుడు ఎత్తుకెళ్లడం గమనార్హం.

బేల మార్ట్ నుంచి రూ.5.97లక్షలు చోరీ


వివరాలు సేకరిస్తున్న సీఐ, ఎస్సై

బేల: మండల కేంద్రంలోని శ్రీకర్ మార్ట్‌లో బుధవారం సాయంత్రం రూ.5.97లక్షల నగదు చోరీకి గురైంది. మార్ట్ యజమాని నగదుతో ఉన్న ప్లాస్టిక్ కవర్‌ను కౌంటర్‌పై ఉంచి కొద్దిసేపు బయటకు వెళ్లాడు. ఈ సమయంలో గుర్తు తెలియని వ్యక్తి ఒకరు నగదుతో ఉన్న ప్లాస్టిక్ కవర్ అపహరించి పరారయ్యాడు. గమనించిన మార్ట్ యజమాని స్వరాజ్ స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. వెంటనే అక్కడికి చేరుకున్న జైనథ్ సీఐ సాయినాథ్, ఎస్సై దివ్య భారతి సీసీ కెమెరాల్లో రికార్డయిన పుటేజీలను పరిశీలించారు. కేసు దర్యాప్తు చేస్తున్నారు.

ద్విచక్ర వాహనం చోరీ

ఆదిలాబాద్‌టౌన్: జిల్లా కేంద్రానికి చెందిన విఠల్ ద్విచక్ర వాహనం గత నెలలో చోరీకి గురైంది. వివరాలు.. విఠల్ కుమారుడి ఆరోగ్యం బాగా లేకపోవడంతో అతడిని రిమ్స్‌లో చేర్పించాడు. బైక్‌ను పార్కింగ్ స్థలంలో నిలిపాడు. మళ్లీ వచ్చేసరికి బైక్ కనిపించలేదు. చుట్టుపక్కలా గాలించినా దొరకలేదు. దీంతో బుధవారం టూటౌన్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై విష్ణుప్రకాశ్ తెలిపారు.

ఆర్టీసీలో కుటుంబ వాతావరణం కల్పిస్తాం

- డిప్యూటీ ఆర్‌ఎం ప్రణీత్
- ముగిసిన వనభోజనాలు


మాట్లాడుతున్న డిప్యూటీ ఆర్‌ఎం ప్రణీత్

ఆదిలాబాద్: ఆర్టీసీలో కుటుంబ వాతావరణాన్ని కల్పించాలనే ఉద్దేశంతో వనభోజనాల కార్యక్రమానికి శ్రీకారం చుట్టినట్లు ఆర్టీసీ ఆదిలాబాద్ డిప్యూటీ ఆర్‌ఎం ప్రణీత్ పేర్కొన్నారు. ఆదిలాబాద్ డిపోలో బుధవారం వనభోజనాల ముగింపు కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. ఉద్యోగుల్లో ఒత్తిడి తగ్గించడానికి యాజమాన్యం ప్రత్యేక దృష్టి సారిస్తోందని తెలిపారు. నిత్యం విధి నిర్వహణలో బిజీగా ఉండే ఉద్యోగులకు ఆహ్లాదకరమైన వాతావరణాన్ని కల్పించేందుకు కృషి చేస్తున్నామని చెప్పారు. సంస్థను ఓ కుటుంబంగా భావించి ప్రతి ఒక్కరూ స్నేహపూర్వక వాతావరణంలో మెలగాలని సూచించారు. కుటుంబ సభ్యులు ఉద్యోగులకు అండగా నిలబడాలని కోరారు. సంస్థ నిర్దేశిస్తున్న లక్ష్యాల సాధనలో ఉద్యోగులు ఎంతగానో శ్రమిస్తున్నారని ప్రశంసించారు. ఆదిలాబాద్ రీజియన్ అగ్రస్థానంలో పయనించేలా ఎంతగానో పాటుపడుతున్నారని పేర్కొన్నారు. ఇదే స్ఫూర్తితో ముందుకు సాగి సంస్థ ప్రగతికి తమ వంతు తోడ్పాటును అందించాలని సూచించారు. కార్యక్రమంలో ఏవో శంకరయ్య, డిపో మేనేజర్ కల్పన, వెల్ఫేర్ బోర్డు మెంబర్ ప్రమీల, ఎంఎఫ్ శ్రీకర్, రిజర్వేషన్ ఇన్‌చార్జి అహ్మద్ హుస్సేన్, ఆర్‌ఎం ఆఫీస్ సిబ్బంది, ఉద్యోగుల కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

ఏసీబీకి పట్టుబడిన మార్కెటింగ్ ఏడీ

- దడ్వాయి లైసెన్స్ కోసం రూ.7వేలు లంచం తీసుకుంటుండగా పట్టివేత


ఆదిలాబాద్ పట్టణంలోని నిర్మల్ మార్కెటింగ్ ఏడీ ఇంట్లో తనిఖీలు నిర్వహిస్తున్న ఏసీబీ అధికారులు

నిర్మల్‌ఖిల్లా/ఆదిలాబాద్‌టౌన్: నిర్మల్ జిల్లాలో అవినీతి అధికారులు వరుసగా ఏసీబీకి పట్టుబడుతున్నారు. నెలరోజుల వ్యవధిలో ముగ్గురు లంచావతారులు రెడ్ హ్యాండెడ్‌గా పట్టుబడ్డారు. నిర్మల్ మార్కెటింగ్ శాఖ అసిస్టెంట్ డైరెక్టర్ శ్రీనివాస్ దడ్వాయి లైసెన్స్ కోసం బుధవారం లంచం తీసుకుంటుండగా పట్టుకున్నారు. ఏసీబీ డీఎస్పీ రమణమూర్తి తెలిపిన వివరాల ప్రకారం.. నిర్మల్ జిల్లా కేంద్రానికి చెందిన కుమ్మరి వెంకటేశ్ దడ్వాయి లైసెన్స్ కోసం గత మార్చిలో దరఖాస్తు చేసుకున్నాడు. పలుసార్లు విన్నవించినా లైసెన్స్ ఇవ్వలేదు. లైసెన్స్ మంజూరు కోసం రూ.10వేలు డిమాండ్ చేశారు. చివరకు రూ.7 వేలకు ఒప్పందం కుదుర్చుకున్నారు. బాధితుడు ఏసీబీని ఆశ్రయించాడు. బుధవారం మధ్యాహ్నం జిల్లా మార్కెటింగ్ కార్యాలయంలో లంచం తీసుకుంటుండగా ఏసీబీ అధికారులు పట్టుకున్నారు. విచారణ అనంతరం నిందితుడిని ఏసీబీ కోర్టులో హాజరు పరుస్తామని ఏసీబీ డీఎస్పీ తెలిపారు. కాగా, ఆదిలాబాద్ జిల్లా కేంద్రంలోని బ్రాహ్మణవాడలో ఉన్న శ్రీనివాస్ నివాసంలోనూ ఏసీబీ అధికారులు సోదాలు చేశారు. పలు రికార్డులు, పత్రాలు స్వాధీనం చేసుకున్నారు. ఈయన గతంలో ఆదిలాబాద్ వ్యవసాయ మార్కెట్ అధికారిగానూ పని చేశారు.

అమ్మవారికి విశేష పూజలు


హోమం నిర్వహిస్తున్న ఆలయ అర్చకులు

బాసర: బాసర శ్రీజ్ఞాన సరస్వతీ దేవస్థానం ఆధ్వర్యంలో బుధవారం అమ్మవారి ఆలయంలో ఆలయ వైదిక బృందం సభ్యులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. రాష్ట్ర ప్రభుత్వ ప్రజాపాలన విజయోత్సవాల సందర్భంగా రాష్ట్ర దేవాదాయ, ధర్మాదాయ శాఖ ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు రాష్ట్ర ప్రజలు, పాలకులు సుభిక్షంగా ఉండాలనే సంకల్పంతో శ్రీవ్యాస మహర్షి ఆలయంలో చండీ హోమం, అమ్మవారి ఉత్సవమూర్తులకు విశేష కుంకుమార్చన పూజ, నీరాజనం, మహా మంత్రపుష్ప కార్యక్రమాలను వేద మంత్రోచ్చారణల మధ్య ఘనంగా నిర్వహించారు. అనంతరం శ్రీజ్ఞాన సరస్వతీ మహాకాళీ, మహాలక్ష్మీ అమ్మవార్లకు విశేష పూజలు నిర్వహించి, భక్తులకు తీర్థప్రసాదాలతో పాటు అమ్మవారి అన్నప్రసాదాన్ని అందజేశారు. ఆలయ కార్యనిర్వహణాధికారి విజయరామారావు, స్థానాచార్యుడు ప్రవీణ్ పాఠక్, ప్రధాన అర్చకుడు సంజీవ్ పూజారి, వేద పండితుడు నవీన్‌శర్మ పాల్గొన్నారు. భక్తులు అధికసంఖ్యలో హాజరై అమ్మవారిని దర్శించుకున్నారు.

కాంట్రాక్ట్ కార్మికులకు అండగా ఉంటాం



మహాసభలో మాట్లాడుతున్న మిర్యాల రాజిరెడ్డి

రెబ్బెన(ఆసిఫాబాద్): సింగరేణిలో పనిచేస్తున్న కాంట్రాక్ట్ కార్మికులకు టీబీజీకేఎస్ ఎప్పుడూ అండగా ఉంటుందని యూనియన్ అధ్యక్షుడు మిర్యాల రాజిరెడ్డి పేర్కొన్నారు. గోలేటి టౌన్‌షిప్‌లోని యూనియన్ కార్యాలయంలో బుధవారం బెల్లంపల్లి ఏరియా సింగరేణి కాంట్రాక్ట్ కార్మిక సంఘం మహాసభ నిర్వహించగా రాజిరెడ్డి ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. సింగరేణిలో పని చేసే కాంట్రాక్ట్ కార్మికులకు సమాన పనికి సమాన వేతనం చెల్లించేలా చూస్తామని, కనీస వేతనాల పెరుగుదలకు కృషి చేస్తామని హామీ ఇచ్చారు. కార్మికుల హక్కుల సాధనకు టీబీజీకేఎస్ ఉద్యమిస్తుందని తెలిపారు. 2022లో జరిగిన సమ్మె సందర్భంగా కార్మిక సంఘాల నాయకులతో చేసుకున్న ఒప్పందాన్ని వెంటనే అమలు చేయాలని, జీవో 22 ప్రకారం కనీస వేతనాలు పెంచాలని, సింగరేణిలో ఖాళీగా ఉన్న కంపెనీ క్వార్టర్లను కాంట్రాక్ట్ కార్మికులకు అలాట్ చేయాలని కోరారు. కోల్‌మైన్స్ రూల్స్ ప్రకారం లీవ్‌లు, ప్లేడేలు, పీహెచ్‌డీలు, ఓటీలకు వేతనాలు చెల్లించాలని, సీఎంపీఎఫ్ పర్మినెంట్ నంబర్లు కేటాయించి బ్యాలెన్స్ చిట్టీలు ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు. బ్లాస్టింగ్, బెల్ట్ క్లీనింగ్ కార్మికులకు సెమీ స్కిల్డ్ వేతనాలు అందించాలని యాజమాన్యాన్ని డిమాండ్ చేశారు. కాంట్రాక్ట్ కార్మికుల సంఘం ఏరియా అధ్యక్షుడు అంబాల ఓదెలు, టీబీజీకేఎస్ ఏరియా ఉపాధ్యక్షుడు మల్రాజు శ్రీనివాస్‌రావు, సెంట్రల్ కమిటీ నాయకులు మంగీలాల్, చంద్రశేఖర్, శ్రీనివాస్, సమ్మయ్య, కిరణ్, సంపత్, పిట్ కార్యదర్శి రమేశ్, గణపతి, నాయకులు చందర్ తదితరులు పాల్గొన్నారు.

తేనెటీగల పెంపకాన్ని ప్రోత్సహిస్తాం


తేనెను పరిశీలిస్తున్న పీవో ఖుష్బూ గుప్తా

ఉట్నూర్‌రూరల్: తేనెటీగల పెంపకం చేపట్టే గిరిజన యువతకు ఐటీడీఏ ప్రోత్సాహం ఉంటుందని పీవో ఖుష్బూ గుప్తా పేర్కొన్నారు. బుధవారం సెంటర్ ఫర్ వరల్డ్ సాలిడారిటీ (సీడబ్ల్యూఎస్) సంస్థ ఆధ్వర్యంలో తేనెటీగల పెంపకంపై ఉట్నూర్ కేబీ ప్రాంగణంలోని సమావేశ మందిరంలో ఏర్పాటు చేసిన మూడురోజుల శిక్షణ ముగింపు కార్యక్రమంలో పాల్గొని మాట్లాడారు. నాణ్యమైన తేనెకు బహిరంగ మార్కెట్‌లో డిమాండ్ ఉందని తెలిపారు. మంచి ఆదాయంతో పాటు 10మందికి ఉపాధి కల్పించవచ్చని స్పష్టం చేశారు. ఆసక్తి కలిగిన గిరిజన యువతకు ఐటీడీఏ సహకారం అందిస్తోందని తెలిపారు. ఐటీడీఏ ప్రాజెక్ట్ ఉద్యాన అధికారి సందీప్ మాట్లాడుతూ.. ఆసక్తి కలిగిన రైతులకు ఉద్యానశాఖ లేదా ఖాదీ విలేజ్ బోర్డు ద్వారా రాయితీలూ కల్పించనున్నట్లు పేర్కొన్నారు. తేనెపట్టు నుంచి తేనె ఎలా సేకరించాలో ప్రయోగాత్మకంగా వివరించారు. కార్యక్రమంలో సీడబ్ల్యూఎస్ సంస్థ ప్రాజెక్ట్ డైరెక్టర్ లక్ష్మీనారాయణ, ట్రైనర్లు రమేశ్, శ్రీకాంత్, సిబ్బంది శ్యామల, అశోక్, తిరుపతి, డిగంబర్, కైలాస్, నాగోరావు, దివ్య, జ్యోతి తదితరులున్నారు.

పోస్టుల భర్తీ ఇష్టారాజ్యం!

- కేజీబీవీల్లో బోధనేతర సిబ్బంది ఎంపిక
- నిబంధనలు ఉల్లంఘించిన అధికారులు
- జిరాక్స్ పత్రాల ఆధారంగానే ఎంపిక?

కేజీబీవీల్లో పోస్టుల వివరాలు ఇలా..

నైట్/డే వాచ్‌ఉమెన్‌లు	09
అసిస్టెంట్ కుక్‌లు	02
అటెండర్	01
స్కావెంజర్	01



బేలలోని ఎమ్మార్సీ కార్యాలయం

బేల: జిల్లాలోని కేజీబీవీల్లో కాంట్రాక్ట్ పద్ధతిలో నైట్/డే వాచ్‌ఉమెన్, అటెండర్, అసిస్టెంట్ కుక్, స్కావెంజర్ పోస్టుల భర్తీల్లో విద్యాశాఖ నిబంధనలు ఉల్లంఘించినట్లు ఆరోపణలు విన్పిస్తున్నాయి. ఈ పోస్టుల ఎంపికలో లక్షల రూపాయలు చేతులు మారడంతో ఎంఈవోలు ఒరిజినల్ ధ్రువీకరణ పత్రాలను పరిశీలించకుండానే, అనుకున్న వారినే ఎంపిక చేసినట్లుగా విమర్శలు వస్తున్నాయి. ఎంఈవోలు చేసిన ఈ ఎంపికను అభ్యర్థుల ఒరిజినల్స్‌ను ఏమాత్రం పరిశీలన చేయకుండానే తహసీల్దార్, ఎంపీడీవోలు సైతం సంతకాలు పెట్టినట్లుగా తెలుస్తోంది.ఈ పోస్టుల ఎంపిక కమిటీలో ఎంఈవో కన్వీనర్‌గా, తహసీల్దార్, ఎంపీడీవోలు సభ్యులుగా ఉన్నారు.

చేతులు మారిన డబ్బు..!

ఈ పోస్టులకు జూలై 30న నోటిఫికేషన్ రాగా మండల కేంద్రాల్లోని మండల విద్యా వనరుల కేంద్రం (ఎమ్మార్సీ)లో జూలై 31, ఆగస్టు 1వ తేదీల్లో దరఖాస్తులు స్వీకరించారు. దరఖాస్తు దారుల నుంచి దరఖాస్తు ఫారంతో పాటు జిరాక్స్ పత్రాలు తీసుకున్నారు. ఈ పోస్టులకు తక్కువ సంఖ్యలో దరఖాస్తులు చేసుకుంటే, వారి ఒరిజినల్స్ పరిశీలించి అర్హులైన అభ్యర్థులను ఎంపిక చేయాలి. అధిక సంఖ్యలో దరఖాస్తులు చేసుకుంటే, 10 మంది మెరిట్ అభ్యర్థులను ఎంపిక చేయాలి. ఈ క్రమంలోనే మెరిట్ అభ్యర్థుల ఒరిజినల్స్‌ను పరిశీలించి, స్థానిక మండలానికి చెందిన అర్హులైన మధ్య వయస్సు వారిని ఈ పోస్టులకు ఎంపిక చేయాలి. స్థానికులకు ప్రాధాన్యత ఇవ్వాలి. కానీ అలా జరగలేదు. జైనథ్, బేల మండలాల్లో మెరిట్ అభ్యర్థుల ఒరిజినల్స్ పరిశీలించకుండానే ఎంఈవోలు వారు అనుకున్న వారినే ఇష్టారాజ్యంగా ఎంపిక చేశారు. ఒక్కో పోస్టుకు రూ.లక్షల్లో చేతులు మారినట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. జైనథ్, బేలతో పాటు మిగతా మండలాల్లోనూ ఇదే తతంగం జరిగినట్లుగా తెలుస్తోంది.

గత ఎంఈవోకే తెలుసు..



బోధనేతర సిబ్బంది ఎంపిక విషయం గత ఎంఈవో శ్రీనివాస్‌కే తెలుసు. ఈ ఎంపిక మండలస్థాయిలో చేశారో, జిల్లా స్థాయిలో చేశారో, ఎలా చేశారో నాకు తెలియదు. ఎంపిక జాబితాను పాత ఎంఈవోనే జిల్లా విద్యాశాఖ సెక్టోరియల్ అధికారికి నివేదించారు. ఆ తర్వాత ఏం జరిగిందో తెలియదు.

– కోల నర్సింహులు, ఎంఈవో, బేల

ఒరిజినల్స్ పరిశీలించలేదు



మెరిట్ అభ్యర్థులను ఎలా ఎంపిక చేశారో తెలియదు. ఎటువంటి మెరిట్‌ను ప్రకటించలేదు. దీంతో పాటు ఎంఈవో, తహసీల్దార్, ఎంపీడీవోలు మెరిట్ అభ్యర్థుల ఒరిజినల్స్ సైతం ఏమాత్రం పరిశీలించలేదు. ఎందుకు పరిశీలించలేదో ప్రశ్నార్థకంగా మారింది. కేవలం జిరాక్స్ పత్రాలపైనే అభ్యర్థుల ఎంపిక ఎలా చేశారో అధికారులకే తెలియాలి.

– నర్మద, దరఖాస్తుదారు

అటవీ సంపదను కాపాడుకోవాలి



ఇచ్చోడలో మాట్లాడుతున్న ఎఫ్ఆర్వో పుండలిక్

ఇచ్చోడ: అటవీ సంపదను కాపాడుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉందని ఇచ్చోడ ఎఫ్ఆర్వో పుండలిక్ అన్నారు. ప్రజాపాలన విజయోత్సవాలు, ప్రపంచ వన్యప్రాణి సంరక్షణ దినోత్సవం సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో పాల్గొని మాట్లాడారు. మానవ మనుగడ కోసం అడవులను రక్షించుకోవాల్సిన అవసరం ఉందన్నారు. అడవుల్లో ఉన్న వన్యప్రాణుల సంరక్షణ కోసం అటవీశాఖ ప్రత్యేకమైన చర్యలు తీసుకుంటున్నట్లు పేర్కొన్నారు. వన్యప్రాణుల ద్వారా నష్టం జరిగితే నష్టపరిహారం అందజేస్తున్నామన్నారు. ఏవో ప్రేమలత, డిప్యూటీ రేంజ్ ఆఫీసర్ ప్రవీణ్‌మహజన్, స్థానిక బీట్ ఆఫీసర్ నౌషిల్, అటవీసిబ్బంది పాల్గొన్నారు.

బజార్‌హత్నూర్: జీవవైవిధ్యాన్ని కాపాడటానికి అడవుల రక్షణ ప్రతీ ఒక్కరి బాధ్యత అని డిప్యూటీ ఎఫ్ఆర్వో ప్రవీణ్ తెలిపారు. బుధవారం మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ సెకండరీ పాఠశాల ఆవరణలో ప్రజాపాలన, ప్రజావిజయోత్సవాల కార్యక్రమంలో భాగంగా విద్యార్థులకు అడవుల రక్షణ, వేసవిలో అడవులలో అగ్నిప్రమాదాల నివారణ, అడవిజంతువుల రక్షణ గురించి అవగాహన సదస్సు నిర్వహించారు. ప్రధానోపాధ్యాయులు భూమన్న, ఫారెస్ట్ బీట్ ఆఫీసర్లు కేశవ్, జ్ఞానేశ్వర్, ఈశ్వర్, వివేక్‌రెడ్డి పాల్గొన్నారు.

ఇంద్రవెల్లి: అడవులకు నిప్పు పెట్టడం వల్ల మానవాళికి ముప్పు ఏర్పడుతుందని ఇంద్రవెల్లి అటవీశాఖ రేంజ్ అధికారి సంతోష్ అన్నారు. ప్రజాపాలన, ప్రజా విజయోత్సవాల్లో భాగంగా బుధవారం మండల కేంద్రంలోని అటవీశాఖ ఆధ్వర్యంలో జిల్లా పరిషత్ పాఠశాల విద్యార్థులతో కలిసి ర్యాలీ నిర్వహించి చెట్ల రక్షణపై అవగాహన కల్పించారు. కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు ముఖడే ఉత్తం, నాయకులు ఎండీ జహీర్ ఉన్నారు.

ఆరోగ్యంపై శ్రద్ధ వహించాలి



మందులు పంపిణీ చేస్తున్న వైద్య సిబ్బంది

నేరడిగొండ: ఆరోగ్యంపై ప్రతీఒక్కరు శ్రద్ధ వహించాలని హెచ్ఈవో పవార్ రవీందర్ అన్నారు. బుధవారం మండలంలోని రోల్‌మామడ గ్రామంలో వైద్య శిబిరాన్ని నిర్వహించారు. ముందుగా గ్రామస్తులను వైద్య సిబ్బంది పరీక్షించారు. అవసరమైన మందులు పంపిణీ చేశారు. హెల్త్ సూపర్‌వైజర్ సంతోష్, అంగన్‌వాడీ కార్యకర్త ఛాయ తదితరులు పాల్గొన్నారు.

కుష్టు వ్యాధి నివారణకు సహకరించాలి

కుష్టు వ్యాధి నివారణకు ప్రతిఒక్కరు సహకరించాలని హెచ్ఈఓ పవార్ రవీందర్ అన్నారు. కుష్టు వ్యాధి గుర్తింపు ఉద్యమంలో భాగంగా బుధవారం మండలంలోని రోల్‌మామడ గ్రామంలో ఇంటింటి సర్వే నిర్వహించారు. ఈ సందర్భంగా కుటుంబ సభ్యులను పరీక్షించారు.

క్లుప్తంగా

పరీక్షలకు విద్యార్థులను సన్నద్ధం చేయాలి



మాట్లాడుతున్న డీఐఈవో రవీందర్

నేరడిగొండ: వచ్చే వార్షిక పరీక్షల కోసం విద్యార్థులను ఇప్పటినుంచే సన్నద్ధం చేయాలని డీఐఈవో రవీందర్ కుమార్ అన్నారు. మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలను బుధవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా తరగతి గదుల్లోకి వెళ్లి విద్యార్థులను పలు ప్రశ్నలు అడిగి జవాబులు రాబట్టారు. అనంతరం కళాశాల లెక్చరర్లతో సమావేశమయ్యారు. కళాశాల ప్రిన్సిపాల్ శబాన తరన్నుమ్, లెక్చరర్లు పాల్గొన్నారు.

వీడీసీ సమావేశాన్ని విజయవంతం చేయండి

ఇచ్చోడ: ఈనెల 5న నిర్వహించనున్న వీడీసీ ప్రత్యేక సమావేశాన్ని విజయవంతం చేయాలని వీడీసీ సమన్వయ కర్త రేనికుంట సురేశ్ తెలిపారు. గురువారం ఉదయం 11 గంటలకు మండల కేంద్రంలోని షార్ప్‌గార్డెన్‌లో నిర్వహించే సమావేశంలో కార్యవర్గాన్ని ఎన్నుకోనున్నట్లు తెలిపారు.

8న అయ్యప్ప ఆలయ వార్షికోత్సవం

ఇచ్చోడ: ఈ నెల 8న నిర్వహించనున్న అయ్యప్ప ఆలయం 10వ వార్షికోత్సవాన్ని విజయవంతం చేయాలని ఆలయ కమిటీ అధ్యక్షుడు చెన్నల మల్లేశ్‌రెడ్డి తెలిపారు. వార్షికోత్సవం సందర్భంగా ఆదివారం సాయంత్రం 6.30 గంటలకు ఆలయ ఆవరణలో మహాపడిపూజ ఉంటుందన్నారు.

ఆత్మహత్య చేసుకున్న రైతు వివరాలు సేకరణ

ఇచ్చోడ: ఆత్మహత్య చేసుకున్న రైతు డొంగ్రే జ్ఞానేశ్వర్ వివరాలను మండల వ్యవసాయాధికారి జాదవ్ కైలాస్ బుధవారం సేకరించారు. జున్ని గ్రామానికి చెందిన జ్ఞానేశ్వర్ గత నాలుగు రోజుల క్రితం అప్పుల బాధతో ఆత్మహత్యకు పాల్పడ్డాడు. దీంతో మండల వ్యవసాయ అధికారి కైలాస్ జున్ని గ్రామంలో రైతుబీమా కోసం వివరాలు సేకరించారు. ఆయన మాట్లాడుతూ రైతులు ఆత్మహత్యలకు పాల్పడవద్దన్నారు.

కళాబృందాల అవగాహన

నేరడిగొండ: ప్రజాపాలన విజయోత్సవాల సందర్భంగా జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు మండలంలోని కుమారి, తర్నం, తేజాపూర్ గ్రామాల్లో బుధవారం తెలంగాణ సాంస్కృతిక సారథి కళాకారుల బృందంచే అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా కళాకారులు పాటల రూపంలో ప్రజాపాలన విజయోత్సవాలపై ప్రజలకు వివరించారు. కళాకారులు ఆత్రం గోవింద్ రావు, రాథోడ్ శంకర్, గోడం ఆశిష్, కుమ్ర నగేశ్, కడప దూర్పత తదితరులు పాల్గొన్నారు.

బీఆర్ఎస్వీ నాయకుల అరెస్ట్

నార్నూర్: వసతి గృహాల్లో విద్యార్థులు ఎదుర్కొంటున్న సమస్యలు తెలుసుకునేందుకు బుధవారం బీఆర్ఎస్వీ సంఘం నాయకులు మండలంలోని తాడిహత్నూర్ ఆశ్రమ పాఠశాల సందర్శనకు వెళ్తుండగా పోలీసులు అడ్డుకున్నారు. వారిని అరెస్ట్ చేసి పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. బీఆర్ఎస్వీ జిల్లా అధ్యక్షుడు ధరణి రాజేశ్ మాట్లాడుతూ కాంగ్రెస్ అసమర్థ పాలన వల్ల తెలంగాణలో 52 మంది విద్యార్థులు ప్రాణాలు కోల్పోయారన్నారు. అరెస్ట్‌లతో ప్రజాఆందోళనలు ఆపలేరన్నారు. బీఆర్ఎస్వీ రాష్ట్ర కార్యదర్శి ఫరీద్, జిల్లా కోఆర్డినేటర్ శివకుమార్ తదితరులు ఉన్నారు.

భక్తిశ్రద్ధలతో అయ్యప్ప స్వామికి చక్రస్నానం

తాంసి: తలమడుగు మండలంలోని సుంకిడి గ్రామంలో గల అయ్యప్పస్వామి ఆలయం ఆధ్వర్యంలో బుధవారం నిర్వహించిన అయ్యప్ప పల్లకి ఊరేగింపు, ఆరట్టు ఉత్సవం కనులపండువగా జరిగింది. వడ్డాడి వద్ద గల మత్తడివాగు ప్రాజెక్టులో అయ్యప్ప ఉత్సవ విగ్రహానికి చక్రస్నానం నిర్వహించారు.అయ్యప్పస్వామి ఆలయ అర్చకుడు గురుస్వామి విశాల్ ఆధ్వర్యంలో పూజలు చేశారు. గురుస్వాములు అధ్యక్షుడు సతీశ్ రెడ్డి, మల్లిఖార్జున్, శ్రీనివాస్, కృష్ణ, సంతోష్, నితీశ్, ప్రవీణ్, లింగన్న తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా సేవాలాల్ వర్ధంతి

ఇచ్చోడ: మండల కేంద్రంలోని పాతబస్టాండ్ వద్ద బుధవారం సేవాలాల్ వర్ధంతి నిర్వహించారు. సేవాలాల్ జెండా వద్ద ప్రత్యేక పూజలు నిర్వహించారు. సేవాలాల్ చేసిన సేవలను కొనియాడారు. బంజార సంఘం నాయకులు నరేందర్ నాయక్, శివలాల్, చౌహాన్‌ఉత్తంసింగ్, రమేశ్, బలరాం నాయక్, చౌహాన్‌బాబుసింగ్ , పకీర్‌దాస్, భాను, దర్మసింగ్ తదితరులు పాల్గొన్నారు.

హిందువులు ఐక్యత చాటాలి



నిరసన కార్యక్రమంలో ఎమ్మెల్యే పాయల్ శంకర్

ఆదిలాబాద్: బంగ్లాదేశ్‌లో హిందువులపై జరుగుతున్న దౌర్జన్యాలను వ్యతిరేకించే విషయంలో హిందువులంతా ఐక్యత చాటాలని ఆదిలాబాద్ ఎమ్మెల్యే పాయల్ శంకర్ పిలుపునిచ్చారు. బంగ్లాదేశ్‌లో హిందువులపై జరుగుతున్న దాడులకు నిరసనగా హిందూ సంఘాల ఐక్యవేదిక ఆధ్వర్యంలో బుధవారం జిల్లా కేంద్రంలోని అంబేద్కర్ చౌక్‌లో నిర్వహించిన నిరసన కార్యక్రమంలో ఎమ్మెల్యే పాల్గొన్నారు. ఆయన మాట్లాడుతూ హిందువులు ఎవరిపై దౌర్జన్యాలకు దిగరని, అందరి మంచిని కోరే హిందువులపై దాడులు జరగడం అమానుషమన్నారు. వెంటనే ఇస్కాన్ ప్రతినిధి చిన్మయి కృష్ణదాస్‌ను విడుదల చేయాలని డిమాండ్ చేశారు. శ్రీ రామచంద్ర గోపాలకృష్ణ మఠాధిపతి శ్రీ యోగానంద సరస్వతి స్వామి, పలువురు హిందూ సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించాలని వినతి



ట్రాన్స్‌ఫార్మర్‌ను పరిశీలిస్తున్న అభిజ్ఞాన్ మాల్వియా

తాంసి: మండల కేంద్రంలో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు సామ సంతోష్ రెడ్డి అసిస్టెంట్ కలెక్టర్ అభిజ్ఞాన్ మాల్వియాను కోరారు. గ్రామంలో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని కోరుతూ బుధవారం తహసీల్దార్ కార్యాలయంలో గ్రామస్తులతో కలిసి అసిస్టెంట్ కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు. ప్రాథమిక పాఠశాల ఎదుట విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ ప్రమాదకరంగా మారిందని తెలపడంతో అసిస్టెంట్ కలెక్టర్ గ్రామస్తులతో కలిసి ట్రాన్స్‌ఫార్మర్‌ను పరిశీలించారు. అనంతరం ప్రాథమిక పాఠశాలను సందర్శించి మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించారు. హెచ్ఎం ఆశారెడ్డి, డిప్యూటీ తహసీల్దార్ జాదవ్ గణేశ్, గ్రామస్తులు సుధాకర్ యాదవ్, పోచ్చారెడ్డి, కిషన్, రాములు తదితరులు ఉన్నారు.

'మా భూమి పాదయాత్ర' విజయవంతం చేయాలి



పోస్టర్ ఆవిష్కరిస్తున్న డీఎస్పీ నాయకులు

ఆదిలాబాద్‌రూరల్: జిల్లా కేంద్రంలోని డైట్ కాలేజీ మైదానంలో జనవరి 5, 2025న నిర్వహించే పాదయాత్ర ప్రారంభ సభకు జిల్లాలోని బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ, అగ్రకుల ప్రజాస్వామ్యవాదులు హాజరై విజయవంతం చేయాలని ధర్మసమాజ్ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు అన్నెల లక్ష్మణ్ పిలుపునిచ్చారు. బుధవారం జిల్లా కేంద్రంలోని ధర్మసమాజ్ పార్టీ కార్యాలయంలో పాదయాత్ర ప్రారంభ సభ పోస్టర్ ఆవిష్కరించారు. పార్టీ జిల్లా అధ్యక్షుడు గణేశ్ మహరాజ్, జిల్లా నాయకులు వెంకటేశ్, నరేశ్, రాజేశ్వర్, రామచందర్, తిరుపతి, ఓమన్న, గంగన్న, నవీన్, విను, కుమార్, సాయి, మధు తదితరులు పాల్గొన్నారు.

హౌజింగ్ బోర్డు స్థలం కబ్జాకు యత్నం



స్థలాన్ని పరిశీలిస్తున్న నితిన్ కుమార్

కై లాస్‌నగర్: ఆదిలాబాద్ మున్సిపల్ పరిధిలోని న్యూహౌజింగ్‌బోర్డు కాలనీలో గల స్థలాన్ని కొంత మంది వ్యక్తులు బుధవారం కబ్జాకు యత్నించడం కలకలం రేపింది. గత కొంత కాలంగా స్థలం ఖాళీగా ఉండటాన్ని గమనించిన కొందరు వ్యక్తులు జేసీబీతో చదును చేయించారు. గమనించిన కొంత మంది స్థానికులు అడ్డుకునే ప్రయత్నం చేయగా వారితో వాగ్వాదానికి దిగారు. కాలనీవాసులు మున్సిపల్ అధికారులకు సమాచారమివ్వగా టౌన్ ప్లానింగ్ అధికారి నితిన్‌కుమార్, హౌజింగ్ బోర్డు ఉద్యోగి రంజిత్ రెడ్డి అక్కడకు చేరుకుని వారిని అడ్డుకున్నారు. దీంతో పనులు నిలిపివేసిన సదరు వ్యక్తులు అక్కడి నుంచి వెళ్లిపోయారు. స్థలాన్ని సంరక్షించేలా మున్సిపల్ అధికారులు చర్యలు తీసుకోవాలని కౌన్సిలర్ పవన్ నాయక్, కాలనీవాసులు కోరుతున్నారు.

కాంగ్రెస్ ప్రభుత్వంలో ప్రజాపాలన

కైలాస్‌నగర్: పదేళ్ల బీఆర్ఎస్ హయాంలో గడీల పాలన నడువగా, ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో అసలైన ప్రజాపాలన కొనసాగుతుందని మాజీ ఎమ్మెల్సీ, ప్రజాపాలన విజయోత్సవ సంబరాల కోఆర్డినేటర్ అరికెల నర్సారెడ్డి అన్నారు. బుధవారం జిల్లా కేంద్రంలోని ప్రజాసేవభవన్‌లో నిర్వహించిన విజయోత్సవ సంబరాలకు ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఏఐసీసీ అగ్రనేత రాహుల్ గాంధీ, సీఎం రేవంత్ రెడ్డిల చిత్రపటాలకు క్షీరాభిషేకం చేశారు. కేక్ కట్ చేసి సంబరాలు జరుపుకున్నారు. డీసీసీబీ చైర్మన్ అడ్డి భోజారెడ్డి, జైనథ్ మార్కెట్ కమిటీ చైర్మన్ అశోక్ రెడ్డి, నాయకులు సంతోష్ రావు, ప్రవీణ్ రెడ్డి, చరణ్ గౌడ్, కౌన్సిలర్లు శ్రీనివాస్, సతీశ్, నర్సింగ్, ఇమ్రాన్ పాల్గొన్నారు.

యాపల్‌గూడలో ప్రజాపాలన సంబరాలు..

ఆదిలాబాద్‌రూరల్: మండలంలోని యాపల్‌గూడలో జరిగిన విజయోత్సవ సంబరాలలో మాజీ ఎమ్మెల్సీ అర్కాల నర్సారెడ్డి పాల్గొన్నారు. స్థానిక కాంగ్రెస్ శ్రేణులు డప్పుచప్పుళ్లతో, పూల వర్షం కురిపిస్తూ ఘన స్వాగతం పలికి శాలువాలతో సత్కరించారు. ముందుగా కుమురం భీం, అంబేద్కర్ విగ్రహాలకు పూల మాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

సంక్షిప్త వార్తలు

టీజీటీ పోస్టుకు దరఖాస్తులు

ఆదిలాబాద్‌టౌన్(జైనథ్): జైనథ్ మండల కేంద్రంలోని మోడల్ స్కూల్‌లో హెచ్‌బీటీ పద్ధతిన ఆంగ్లం బోధించేందుకు అర్హులైన అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవాలని మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్ రాము ఒక ప్రకటనలో తెలిపారు. బీఈడీ, టెట్ అర్హత ఉన్న అభ్యర్థులు దరఖాస్తులు చేసుకోవాలన్నారు. ఈనెల 7వ తేదీలోగా మోడల్ స్కూల్‌లో దరఖాస్తులు సమర్పించాలని కోరారు.

ఏకరూప దుస్తులు పంపిణీ

తాంసి: భీంపూర్ మండల కేంద్రంలో బుధవారం తహసీల్దార్ నలందప్రియ అంగన్‌వాడీ పిల్లలకు ఏకరూప దుస్తులు పంపిణీ చేశారు. ఆయా అంగన్‌వాడీ కేంద్రాలకు చెందిన చిన్నారుల దుస్తులను అంగన్‌వాడీ కార్యకర్తలకు అందజేశారు.

వృద్ధులకు దుప్పట్లు పంపిణీ

బోథ్: పట్టణ కేంద్రంలోని వృద్ధులకు మాసం లక్ష్మి వెల్ఫేర్ సొసైటీ ఆధ్వర్యంలో అధ్యక్షుడు మాసం అనిల్ బుధవారం దుప్పట్లు పంపిణీ చేశారు.

విద్యార్థుల ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ

నేరడిగొండ: విద్యార్థుల ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నామని పీహెచ్‌సీ హెచ్ఈవో పవారు రవీందర్ అన్నారు. బుధవారం మండలంలోని కేజీబీవీ పాఠశాలలో వైద్య శిబిరాన్ని నిర్వహించారు.

క్యాన్సర్ బాధితుడికి ఆర్థికసాయం

ఆదిలాబాద్‌టౌన్: పట్టణంలోని వరలక్ష్మినగర్‌కు చెందిన అబ్దుల్ సమద్ కుమారుడు అజీమ్ క్యాన్సర్ వ్యాధితో బాధపడుతున్నాడు. విషయం తెలుసుకున్న సామాజిక కార్యకర్త ముడుపు మౌనిష్ రెడ్డి బుధవారం ఆయన నివాసానికి వెళ్లి ఆర్థికసాయం అందజేశారు.

మీసేవల్లో అధిక రుసుం వసూలు చేస్తే చర్యలు

కైలాస్‌నగర్: మీసేవా కేంద్రాల్లో ప్రభుత్వం నిర్ణయించిన రుసుం కంటే అధికంగా వసూలు చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని ఆదిలాబాద్‌అర్బన్ మండల తహసీల్దార్ సంపతి శ్రీనివాస్ అన్నారు. బుధవారం తన కార్యాలయ చాంబర్‌లో పట్టణంలోని మీ సేవ కేంద్రాల నిర్వాహకులతో ప్రత్యేక సమావేశాన్ని నిర్వహించారు.

తలమడుగులో విజ్ఞానశాస్త్ర ప్రదర్శన

తలమడుగు: మండల కేంద్రంలోని జెడ్పీహెచ్ఎస్ పాఠశాలలో బుధవారం (సైన్స్ ఫెయిర్) విజ్ఞాన శాస్త్ర ప్రదర్శన నిర్వహించారు. విద్యార్థులు అనేక రకాల ప్రాజెక్టులను ప్రదర్శించారు. ఎంఈవో వెంకట్‌రావు మాట్లాడుతూ ఏడు ప్రదర్శనలను జిల్లా స్థాయికి ఎంపిక చేశామన్నారు.

ఘనంగా ప్రజాపాలన విజయోత్సవం

నార్నూర్: మండల కేంద్రంలోని గ్రామ పంచాయతీ కార్యాలయంలో నిర్వహించిన ప్రజా పాలన విజయోత్సవ కార్యక్రమాన్ని బుధవారం అటవీశాఖ అధికారులు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మొక్కలు నాటారు. ఎఫ్ఎస్‌వో జాదవ్ సుదర్శన్ మాట్లాడుతూ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను క్షేత్రస్థాయిలో తీసుకెళ్లడానికి, అడవుల సంరక్షణ కోసం పకడ్బందీ వ్యూహంతో పనిచేస్తామన్నారు. గ్రామపంచాయతీ కార్యదర్శి మోతీరామ్ తదితరులు పాల్గొన్నారు.

బోథ్: మండల కేంద్రంలోని అటవీశాఖ కార్యాలయంలో బుధవారం ప్రజాపాలన విజయోత్సవ సంబరాలు నిర్వహించారు. మార్కెట్ కమిటీ చైర్మన్ బొడ్డు గంగారెడ్డి, ఎఫ్ఆర్వో ప్రణయ్, అటవీ శాఖ అధికారి ప్రణయ్ కుమార్, నాయకులు ఉన్నారు.

సిరికొండ: మండల కేంద్రంలో బుధవారం ప్రజాపాలనా విజయోత్సవాల కార్యక్రమాన్ని అటవీశాఖ ఆధ్వర్యంలో నిర్వహించారు. స్థానిక జెడ్పీ పాఠశాలలో జరిగిన కార్యక్రమంలో తహసీల్దార్ తుకారాం, ఎంపీడీవో రవీందర్, ఎంఈవో పాల్గొన్నారు.

ప్రెస్‌క్లబ్ కార్యవర్గానికి సన్మానం

బోథ్: నూతనంగా ఎన్నికైన బోథ్ ప్రెస్‌క్లబ్ కార్యవర్గాన్ని ఎమ్మెల్యే అనిల్ జాదవ్, కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి ఆడే గజేందర్ వేర్వేరుగా సన్మానించారు.

కార్యాలయాల కోసం భవనాల పరిశీలన

బోథ్: నూతన మండలంగా ఏర్పాటైన సొనాలలో ప్రభుత్వ కార్యాలయాల ఏర్పాటు కోసం బోథ్ తహసీల్దార్ సుభాష్, ఎంపీడీవో రమేశ్‌లు బుధవారం పలు భవనాలను పరిశీలించారు. గ్రామంలోని జిల్లా పరిషత్ సెకండరీ పాఠశాల, ఎస్సీ హాస్టల్, కోఆపరేటివ్ భవనాలను పరిశీలించారు.

యోగాపై ప్రత్యేక అవగాహన

బోథ్: మండలంలోని మర్లపల్లి గ్రామంలో గల జిల్లా పరిషత్ సెకండరీ పాఠశాలలో బుధవారం ఆయుష్ యోగా ఇన్‌స్ట్రక్టర్ మునిగెల యోగిత విద్యార్థులకు యోగా తరగతులు నిర్వహించారు. పాఠశాల ఇన్‌చార్జి ప్రధానోపాధ్యాయులు లక్ష్మణ్, వ్యాయామ ఉపాధ్యాయులు, సిబ్బంది పాల్గొన్నారు.

సీసీఐ కేంద్రాల తనిఖీ

బోథ్: బోథ్ మార్కెట్ పరిధిలోని పలు సీసీఐ పత్తి కొనుగోలు కేంద్రాలను మార్కెట్ జేడీఎం శ్రీనివాస్ బుధవారం తనిఖీ చేశారు. ఓ సీసీఐ కేంద్రంలో నాణ్యమైన పత్తిని తీసుకొచ్చిన రైతును శాలువాతో సన్మానించారు. మార్కెట్ కమిటీ చైర్మన్ బొడ్డు గంగారెడ్డి, ప్రత్యేక శ్రేణి కార్యదర్శి విఠల్‌లు ఆయనను శాలువాతో సత్కరించారు.

యువజన కాంగ్రెస్ నాయకులకు సన్మానం

కై లాస్‌నగర్: ఇటీవల ఆన్‌లైన్ ఓటింగ్ ద్వారా జరిగిన యువజన కాంగ్రెస్ ఎన్నికల ఫలితాలను బుధవారం ప్రకటించారు. రాష్ట్ర కార్యవర్గ సభ్యులుగా శాంతన్ రావు, జిల్లా అధ్యక్షుడిగా చరణ్ గౌడ్, జిల్లా జనరల్ సెక్రెటరీగా వేముల నాగరాజు, అసెంబ్లీ వైస్ ప్రెసిడెంట్‌గా సామ రూపేశ్ రెడ్డి ఎన్నికయ్యారు. వారిని స్థానిక ప్రజాసేవభవన్‌లో కాంగ్రెస్ నాయకులు సన్మానించారు.

యువజన అసెంబ్లీ అధ్యక్షుడికి సన్మానం

యువజన కాంగ్రెస్ ఫలితాల్లో యువజన అసెంబ్లీ అధ్యక్షుడిగా మహమ్మద్ నహీద్, జిల్లా ప్రధాన కార్యదర్శిగా సంఘ అశోక్, పట్టణ అధ్యక్షుడిగా సుగత్‌లు విజయం సాధించారు. బుధవారం జిల్లా కేంద్రంలోని మాజీ మంత్రి చిల్కూరి రామచంద్రా రెడ్డి నివాసంలో వారిని ఘనంగా సన్మానించారు.

నేటి నుంచి దవల్ మాలిక్ బాబా జాతర

తాంసి: భీంపూర్ మండలంలోని దవల్‌మాలిక్ బాబా (బోర్లకుంట) జాతర గురువారం నుంచి ప్రారంభం కానుంది. ఈమేరకు ఎమ్మెల్యే అనిల్ జాదవ్‌ను కలిసి నిర్వాహకులు జాతరకు రావాలని ఆహ్వానించారు. జాతరకు వచ్చే భక్తులకు ఇబ్బందులు కలగకుండా పూర్తిస్థాయిలో ఏర్పాట్లు చేసినట్లు నిపాని మాజీ సర్పంచ్ రాజన్న తెలిపారు.

ఆశ్రమ పాఠశాల విద్యార్థులకు మెరుగైన విద్య అందించాలి

ఇచ్చోడ: ఆశ్రమ పాఠశాల విద్యార్థులకు మెరుగైన విద్య అందించాలని ఐటీడీఏ పీవో ఖుష్బు గుప్తా అన్నారు. బుధవారం మండల కేంద్రంలోని ఆశ్రమ పాఠశాల, నేరడిగొండ మండలంలోని లఖంపూర్ ఆశ్రమ పాఠశాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు.

పత్తిపంట కాలాన్ని పొడిగించవద్దు

ఎదులాపురం: పత్తి పంటను గులాబీ పురుగు ఆశిస్తున్న నేపథ్యంలో పంటకు నీళ్లు అందించి పంట కాలాన్ని మరింత పొడిగించకుండా, వెంటనే ముగించేలా రైతులు తగు చర్యలు తీసుకోవాలని కేవీకే సమన్వయ కర్త ప్రవీణ్‌కుమార్, ఏఆర్ఎస్ హెడ్ రామ్‌ప్రసాద్‌లు అన్నారు. కేంద్రియ పత్తి పరిశోధన స్థానం నాగ్‌పూర్ సహకారంతో కేవీకే ఆదిలాబాద్‌లో సాగు చేస్తున్న 'అధిక సాంద్రత పద్ధతి పత్తి సాగు' పంట క్షేత్రాన్ని బుధవారం సందర్శించారు.

ఘనంగా హనుమత్ వాహన సేవ

ఆదిలాబాద్: జిల్లా కేంద్రంలోని శ్రీరామచంద్ర గోపాలకృష్ణ మఠంలో జాతర ఉత్సవాలు కొనసాగుతున్నాయి. వేడుకల్లో భాగంగా బుధవారం హనుమత్ వాహన సేవను ఘనంగా నిర్వహించారు. భక్తి గీతాలు నడుమ భాజా భజంత్రీలతో రథాన్ని ఊరేగించారు. మఠాధిపతి యోగానంద సరస్వతి స్వామి, సనాతన హిందూ ఉత్సవ సమితి అధ్యక్షుడు ప్రమోద్ కుమార్ ఖత్రి, గెడం మాధవ్, బండారి దేవన్న, మహేశ్, ఉమేశ్, సంతోష్ తదితరులు పాల్గొన్నారు.

రైల్వే ఉద్యోగుల సంఘం ఎన్నికలు

ఆదిలాబాద్: ఆదిలాబాద్ రైల్వేస్టేషన్‌లో రైల్వే ఉద్యోగుల గుర్తింపు సంఘాలకు సంబంధించి బుధవారం ఎన్నికలు నిర్వహించారు. ఎన్నికల్లో ఐదు కార్మిక సంఘాలు పోటీపడుతుండగా, రైల్వే స్టేషన్‌లో పోలింగ్ బూత్ ఏర్పాటు చేయగా, ఉద్యోగులు ఓటు హక్కును సద్వినియోగం చేసుకున్నారు.

ఫోరెన్సిక్‌పై న్యాయవాదులకు అవగాహన

ఆదిలాబాద్‌టౌన్: న్యాయవాదులకు ప్రోబిల్యాబ్ ఫోరెన్సిక్ సంస్థ ఆధ్వర్యంలో ఫోరెన్సిక్‌పై అవగాహన కల్పించారు. బుధవారం జిల్లా కేంద్రంలోని కోర్టు ఆవరణలో గల బార్ అసోసియేషన్ కార్యాలయంలో కార్యక్రమాన్ని నిర్వహించారు. జిల్లా జడ్జి ప్రభాకర్‌రావు, జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి సౌజన్య, ఫోరెన్సిక్ ల్యాబ్ డైరెక్టర్ మోహన్ ఎర్రగొల్ల, బార్ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శి నగేశ్, సంతోష్, న్యాయవాదులు పాల్గొన్నారు.

తాత్కాలికంగా పత్తి కొనుగోళ్ల నిలిపివేత

బోథ్: బోథ్ మార్కెట్ పరిధిలోని స్వప్న, రాఘవేంద్ర, సాయిదత్త, పొచ్చెరలోని సాయిబాబా, నేరడిగొండలోని దర్శన్ జిన్నింగ్ ఫ్యాక్టరీలోని సీసీఐ కేంద్రాల్లో తాత్కాలికంగా బుధవారం నుంచి ఈ నెల 8వ తేదీ వరకు కొనుగోళ్లను నిలిపివేస్తున్నట్లు మార్కెట్ కమిటీ ప్రత్యేక శ్రేణి కార్యదర్శి విఠల్ తెలిపారు.

పేకాట ఆడుతున్న వ్యక్తులు అరెస్ట్

ఆదిలాబాద్‌రూరల్: మండలంలోని యాపల్‌గూడ గ్రామ సమీపంలో గల శ్మశాన వాటిక వద్ద పేకాట ఆడుతున్న అదే గ్రామానికి చెందిన ఐదుగురు వ్యక్తులను బుధవారం అరెస్ట్ చేసినట్లు ఎస్సై ముజాహిద్ తెలిపారు. ఆయన కథనం ప్రకారం యాపల్‌గూడలో పేకాట ఆడుతున్నట్లు వచ్చిన సమాచారం మేరకు దాడి చేసి రూ.9660 నగదు, పేక ముక్కలను స్వాధీనం చేసుకున్నామన్నారు.

కలెక్టరేట్ గేట్‌ను ఢీకొట్టిన బస్సు



బస్సు ఢీకొట్టడంతో పడిపోయిన గేట్

కైలాస్‌నగర్: ఆదిలాబాద్ పట్టణంలోని జిల్లా కలెక్టర్ కార్యాలయ ఔట్ గేట్‌ను బుధవారం ఆర్టీసీ బస్సు ఢీకొట్టింది. ఘటనలో ప్రహరీ ధ్వంసం కాగా గేట్ విరిగి కింద పడింది. దాని పక్కనే నిలిపిన పోలీస్ బారికేడ్లు సైతం కిందపడిపోయాయి. విషయం తెలిసి అక్కడకు చేరుకున్న టూ టౌన్ పోలీసులు పడిపోయిన బారికేడ్లను అక్కడి నుంచి తీసివేశారు. కాగా గ్రూప్–4 అభ్యర్థులను తీసుకెళ్లేందుకు కలెక్టరేట్‌కు వచ్చిన ఓ బస్సు ప్రమాదవశాత్తు ఢీకొట్టడంతోనే ఈ ఘటన జరిగినట్లుగా పోలీసులు వెల్లడించారు.